

జిల్లా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్

చికిత్స లేదు..!

నివారణ ఒక్కటే మార్గం..!

- గుర్తుందా కదా.. మరచిపోయారా..?
- ఎయిడ్స్.. ఇంకా వెంటాడుతూనే ఉంది
- రాష్ట్రస్థాయిలో జిల్లాకు ఎనిమిదో స్థానం
- 31 మండలాల్లోనూ హెచ్‌ఐవీ బాధితులు

అప్పట్లో ఆ పేరు వింటే వణికిపోయేవారు. ప్రచారం కూడా హోరెత్తిపోయేది. వాల్ పోస్టర్లు, కరపత్రాలు, ర్యాలీలు, అవగాహన సదస్సులు, టీవీలు, రేడియోలు, సినిమా హాళ్లలో ప్రకటనలు..! ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ. ఫలితంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల జనంలో అవగాహన పెరిగింది. వ్యాధి సోకకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకునేవారు. సురక్షిత లైంగిక పద్ధతులను ప్రారంభించారు. రక్త మార్పిడి, ఒకసారి వాడిన సిరంజిలు పడేయడం, సెలూన్‌లలో పరికరాల శుభ్రత, బ్లేడ్ మార్చారో లేదో పరిశీలించడం.. ఇలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. హైవేలలో సుదూర ప్రయాణాలు చేసే డ్రైవర్లు సెక్స్ వర్కర్లతో గడుపుతున్న కారణంగా వైరస్ వ్యాపిస్తోందని గుర్తించి.. దాన్నీ కట్టడి చేశారు. మునుపటితో పోలిస్తే.. దీని గురించి ఇప్పుడు పెద్దగా చర్చ జరగడం లేదు. కానీ, విపత్తు తొలగి పోలేదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా హెచ్‌ఐవీ సోకుతుందని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికీ హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌కు చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమని అంటున్నారు.

-అనంతపురం టౌన్

ఎలా సోకుతుందంటే..

హ్యూమన్ ఇమ్యూనో డెఫీసియెన్సీ వైరస్ (హెచ్‌ఐవీ) మానవ శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పూర్తిగా దెబ్బతీస్తుంది. అంటువ్యాధులు, రోగాలతో పోరాడే సామర్థ్యాన్ని బలహీనపరుస్తుంది. ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తుంది. ఈ స్థితిని ఎయిడ్స్(అక్వైర్డ్ ఇమ్యూన్ డెఫీసియెన్సీ సిండ్రోమ్) అంటారు. హెచ్‌ఐవీ సోకినంతమాత్రాన ఎయిడ్స్ ఉన్నట్లు కాదు. సకాలంలో గుర్తించి, సరైన వైద్యం తీసుకుంటే ఈ స్థితిలో కొన్నేళ్లపాటు జీవించవచ్చు. కానీ నిర్లక్ష్యం చేస్తే తీవ్రత పెరిగి ఎయిడ్స్ సంక్రమిస్తుంది. ప్రాణాపాయ స్థితికి చేరుకుంటారు. ఎలాంటి రక్షణ లేకుండా లైంగిక ప్రక్రియలో పాల్గొనడం ద్వారా వైరస్ ఒకరి నుంచి ఒకరికి సంక్రమిస్తుంది. హెచ్‌ఐవీ ఉన్నవారికి వాడిన సూదులు, సిరంజిలను ఇతరులకు వాడినా వైరస్ సోకుతుంది. హెచ్‌ఐవీ బాధితుల రక్తాన్ని మరొకరికి ఎక్కించినా వైరస్ సోకుతుంది. గతంలో తల్లి నుంచి గర్భస్థ శిశువుకు వైరస్ సోకేది. కానీ ఆ ప్రమాదం నుంచి బిడ్డను బయట పడేసే ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఫలితంగా తల్లికి వైరస్ ఉన్నా.. బిడ్డకు సోకుండా వైద్యులు కాపాడగలుగుతున్నారు.

ఎక్కడికీ పోలేదు..

అభివృద్ధిచెందిన సమాజంలో ఉంటున్నాం. సాంకేతికపరంగానూ దూసుకుపోతున్నాం. ఇలాంటి తరుణంలోనూ నిర్లక్ష్యం కొనసాగుతోంది. 'ఏమౌతుందిలే..' అనుకుని.. క్షణికావేశానికి.. క్షణికానందానికి పోతున్నారు. ఫలితంగా హెచ్‌ఐవీ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. తమ జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారు. ఆధారపడిన భార్య, బిడ్డల జీవితాల్లో అంధకారం నింపుతున్నారు. జిల్లాలో హెచ్‌ఐవీ కేసుల గణాంకాలు ప్రమాదం ఏమాత్రం తగ్గలేదని స్పష్టంగా చెబుతున్నాయి. జిల్లాలోని 31 మండలాల్లోనూ హెచ్‌ఐవీ కేసులు ఉన్నాయి. మూడు ప్రాంతాలలో కేసులు సంఖ్య మరీ ఎక్కువగా ఉంది.



జిల్లా ఆస్పత్రిలోని హెచ్‌ఐవీ బాధితులకు మందులు అందించే కౌంటర్

తరిమేద్దాం..

అధికారిక గణాంకాలు ప్రకారం జిల్లాలో గడిచిన మూడేళ్లలో 1,129 హెచ్‌ఐవీ కేసులు నమోదయ్యాయి. 2022-23లో జిల్లాలో 498 కేసులు, 2023-24లో 519 కేసులు నమోద య్యాయి. 2024-25లో ఏడాదికి సంబంధించి.. ఇప్పటివరకు 112 కేసులు నమోదయ్యాయి. హెచ్‌ఐవీ బాధితులలో ఉన్నత విద్యావంతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు.. చివరకు కొందరు వైద్యులు కూడా ఉండటం గమనార్హం. వీరిలో కొందరికి తల్లిదండ్రుల నుంచి వైరస్ సోకింది. ఇందులో వారి పొరపాటు ఏమీ లేదు. బాధితులు చికిత్స చేయించుకుంటూ ఆత్మస్థైర్యంతో జీవిస్తున్నారు.

మూడు ప్రాంతాల్లో ఎక్కువ

అధికారిక గణాంకాల ప్రకారం హెచ్‌ఐవీ కేసులు అనంతపురం నగరంలో అత్యధికంగా ఉన్నాయి. రెండో స్థానంలో గుంతకల్లు, మూడో స్థానంలో తాడిపత్రి ఉన్నాయి. కేసుల సంఖ్య కూడా ఎక్కడే ఎక్కువగా పెరుగుతోంది.

- అనంతపురం నగరంలో 2022-23లో 107 కేసులు, 2023-24లో 112 కేసులు 2024-25లో ఇప్పటి వరకూ 33 కేసులు నమోదయ్యాయి. గుంతకల్లులో 2022-23లో 53 కేసులు, 2023-24లో 59 కేసులు, 2024-25లో ఇప్పటి వరకూ 15 కేసులు నమోదయ్యాయి. తాడిపత్రిలో 2022-23లో 57 కేసులు, 2023-24లో 56 కేసులు, 2024-25లో ఇప్పటి వరకూ 11 కేసులు నమోదయ్యాయి. ఈ లెక్కన గడిచిన మూడేళ్లలో అనంతపురం నగరంలో 252, గుంతకల్లులో 127, తాడిపత్రిలో 124 కేసులు నమోదయ్యాయి.
- గడిచిన మూడేళ్లలో గుత్తిలో 60, బుక్కరాయసముద్రంలో 58, కణేకల్లులో 37, ఉరవకొండలో 37, గార్లదిన్నె 36, కల్యాణదుర్గం 27, నార్పల 26, వజ్రకరూరు 22, డి.హీరేహాళ్ 21, పెద్దవడుగూరు 20, పామిడి 20, ఆత్మకూరు 19, కుందిర్పి 19, విడపనకల్లు 17, శెట్టూరు 16, పెద్దపప్పూరు 15, పుట్లూరు 14, బొమ్మనహాళ్ 13, బ్రహ్మసముద్రం 13, రాప్తాడు 11, ఎల్లనూరు 09, బెళుగుప్ప మండలంలో 08 కేసులు నమోదయ్యాయి.



చికిత్స లేదు..

ఎయిడ్స్‌కు చికిత్స లేదు. నివారణ ఒక్కటే మార్గం. వైరస్‌ను అదుపులో ఉంచుకుని దీర్ఘకాలం జీవించడానికి అవకాశాలు ఉన్నాయి. యాంటీ రెట్రోవైరల్ థెరపీ(ఏఆర్‌టీ) మందులు వాడడం వల్ల వైరస్ లక్షణాలను తగ్గించవచ్చు. ఈ మందులు తీసుకున్నా.. హెచ్‌ఐవీని పూర్తిగా నిర్మూలించలేము. లక్షణాలను తగ్గించి, రోగ నిరోధక శక్తిని మెరుగు పరిచేందుకు మాత్రమే ఈ మందులు ఉపయోగపడతాయి. హెచ్‌ఐవీ బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడాలి. పౌష్టికాహారం తీసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ఏఆర్‌టీ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఉచితంగా మందులు, పౌష్టికాహారాన్ని అందజేస్తోంది.

- డాక్టర్ అనుపమ జేమ్స్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ పోగ్రామ్ అధికారి



రోజూ మందులు ఇస్తున్నాం

ఎయిడ్స్ మందులకు కొరత లేదు. జిల్లా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో రోజుకు 300 మందికి పైగానే ఉచితంగా మందులు తీసుకుపోతున్నారు. కర్నూలు జిల్లావారు కూడా మన జిల్లాకు వచ్చి మందులు తీసుకుపోతున్నారు. తమ ప్రాంతంలో మందులు తీసుకుంటే విషయం అందరికీ తెలుస్తుందని వారు దిగులు పడుతున్నారు. అందుకే వారికి ఇక్కడ మందులు ఇస్తున్నాం. ఈ మందులను సక్రమంగా వాడాలి. నిర్లక్ష్యం చేస్తే వ్యాధి తీవ్రత పెరుగుతుంది. తొందరగా క్షీణించిపోతారు. ప్రాణానికి ప్రమాదం ఏర్పడుతుంది. ఎయిడ్స్ బాధితులు ఇతర జబ్బులకు ఏ మాత్రలు పడితే అవి ప్రైవేటుగా కొని వాడకూడదు. ఏ సమస్య ఉన్నా ఏఆర్‌టీ సెంటర్‌కు రావాలి. ఇక్కడ పరీక్షించి ఆ వ్యాధులకు సరిపడా మందులు ఇస్తాం.

- డాక్టర్ సత్యనారాయణ, ఏఆర్‌టీ సెంటర్, జిల్లా ఆస్పత్రి



చైతన్యం నింపుతున్నాం..

హెచ్‌ఐవీ సోకకుండా వైద్య ఆరోగ్యశాఖ ప్రజ లలో చైతన్యం నింపుతోంది. ప్రత్యేక ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఏర్పాటు చేయించి, ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుందో వివరిస్తున్నాం. హెచ్‌ఐవీ బారిన పడితే మనిషి జీవితం ఎలా మారిపోతుందో, ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగానికి రాష్ట్ర స్థాయిలో పురస్కారాలు వచ్చాయి. అదే స్ఫూర్తితోనే జిల్లాలో హెచ్‌ఐవీ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు సహకరించాలి.

- డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్‌ఓ

రేపు 5కే రన్

ఎయిడ్స్ పట్ల చైతన్యం కలిగించడానికే: డాక్టర్ అనుపమజేమ్స్



సమీక్షలో మాట్లాడుతున్న ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్

అనంతపురం టౌన్, ఆగస్టు 27: ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి గురువారం చేపట్టిన 5కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ అనుపమజేమ్స్ పిలుపునిచ్చారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆమె సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజ్ నుంచి ఉదయం 6-30 గంటలకు రన్ మొదలై టవర్ క్లాక్, సప్తగిరిసర్కిల్, ఆస్పత్రి మీదుగా కోర్టురోడ్డు నుంచి తిరిగి కాలేజ్ వద్దకు చేరుకుంటుందన్నారు. ఈరన్‌లో విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. 17నుంచి 25ఏళ్ల వయసు వారంతా ఈరన్‌లో పాల్గొనవచ్చన్నారు. కుష్ఠు బాధితుల గుర్తింపు కూడా పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. గత నెల నుంచి జరుగుతున్న సర్వేలో ఇప్పటికి 63 కొత్తకేసులు వచ్చాయని, అందరికి మందులు అందించి వాడేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శివారెడ్డి, పారామెడికల్ ఆఫీసర్ నాగన్న,హెచ్ఈఓ సత్యనారాయణతదితరులు పాల్గొన్నారు.

ఇసుక రచ్చ

అక్రమ రవాణాను అడ్డుకున్న అశ్మిత్ టీం

- తీవ్ర వాగ్వాదం.. టిప్పర్ యజమానుల దాడి
- ఎమ్మెల్యే చెప్పినా కేసు నమోదు చేయని సీఐ
- రూరల్ పీఎస్ వద్ద ఆందోళనకు దిగిన ఎమ్మెల్యే
- సీఐ క్షమాపణలు చెప్పడంతో సద్దుమణిగిన వివాదం





రూరల్ పీఎస్ వద్ద ఆందోళన

తాడిపత్రి, ఆగస్టు 27: ఇసుక అక్రమ రవాణా వ్యవహారం తాడిపత్రిలో మంగళవారం ఉద్రిక్తతకు దారితీసింది. ఇసుక అక్రమ రవాణాకు రూరల్ సీఐ లక్ష్మీకాంత రెడ్డి సహకరిస్తున్నారని, వాహనాలను పట్టించినా కేసులు నమోదు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి మంగళవారం ఆందోళనకు దిగారు. పార్టీ నాయకులతో కలిసి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తన అనుచరుల బృందాన్ని ఏర్పాటు చేశారు. తాడిపత్రి మండలం ఆలూరు, సజ్జలదిన్నె, వీరాపురం సమీపంలోని పెన్నా పరివాహక ప్రాంతం నుంచి సోమవారం రాత్రి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా.. ఎమ్మెల్యే నియమించిన బృందం అడ్డుకుంది. ఆ సమయంలో ఎమ్మెల్యే అనుచరులు బృందానికి టిప్పర్ యజమానులు, ఇసుక తరలింపుదారులకు మధ్య తీవ్రస్థాయి వాగ్వాదం జరిగింది. ఇసుక తరలింపుదారుల దాడిలో ఎమ్మెల్యే అనుచరులు ముగ్గురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నాలుగు టిప్పర్లు, నాలుగు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. ఈ గొడవ గురించి ఎమ్మెల్యే అశ్మిత్ రెడ్డి మంగళవారం ఉదయం ఆయన అనుచరులు తెలియజేశారు. ఇసుక టిప్పర్లను సీజ్ చేయకుండా సీఐ లక్ష్మీకాంతరెడ్డి వదిలిపెట్టారని, తమపై దాడి జరిగినా కేసు నమోదు చేయలేదని ఎమ్మెల్యేకు తెలిపారు. దీంతో సీఐకి ఎమ్మెల్యే ఫోన్ చేసి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నవారిపై కేసు నమోదు చేయాలని సూచించారు. కానీ సీఐ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని, మధ్యలోనే ఫోన్ కట్ చేశారని ఆగ్రహించిన ఎమ్మెల్యే.. నేరుగా రూరల్ పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి ధర్నాకు దిగారు. 'వైసీపీ సీఐ లక్ష్మీకాంతరెడ్డి డౌన్ డౌన్' అంటూ టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. సీఐని సస్పెండ్ చేయాలని, లేదంటే ఎమ్మెల్యేకి క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జనార్దన్‌నాయుడు, పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ అక్కడికి చేరుకుని ఎమ్మెల్యేకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఆయన వినకపోవడంతో ఎస్పీ జగదీష్‌కు ఫోన్ చేసి మాట్లాడించారు. ఎమ్మెల్యే పట్టు వీడకపోవడంతో పోలీసు ఉన్నతాధికారులు సీఐ ఫోన్ చేసి మాట్లాడారు. ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలని ఆదేశించారు. ఎమ్మెల్యేకి సీఐ వీడియో కాల్ చేసి క్షమాపణ చెప్పడంతో ఎమ్మెల్యే ఆందోళన విరమించారు. సుమారు నాలుగు గంటలపాటు ఆందోళన కొనసాగింది. వర్షం కురిసినా ఎమ్మెల్యే ఆయన అనుచరులు కదల్లేదు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా జరుగుతున్న సమయంలోనే యల్లనూరు రోడ్డులోని ద్వారకా విల్లాస్‌లో సీఐ లక్ష్మీకాంతరెడ్డి ఇంటిని ముట్టడించేందుకు టీడీపీ శ్రేణులు వెళ్లాయి. విల్లాస్ వద్ద సెక్యూరిటీ అడ్డుకోవడంతో అక్కడున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఆందోళనలో టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, చింబిలి వెంకటరమణ, వేలూరు రంగయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు సరస్వతి, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైకి వస్తాం: అశ్మిత్

ఇసుక అక్రమ తరలింపునకు పోలీసు అధికారులు అడ్డుకట్ట వేయకపోతే రోడ్లపైకి వస్తామని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనే ఇసుక అక్రమ రవాణాపై యుద్ధం చేశామని అన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్నామని ఇసుకను అక్రమంగా తరలిస్తే సహించేది లేదని అన్నారు. ఇసుక విషయంలో అక్రమాలు జరిగితే ఉపేక్షించనని హెచ్చరించారు. సజ్జలదిన్నె, ఆలూరు, వీరాపురం గ్రామాల సరిహద్దులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసి.. తాను ఏర్పాటుచేసిన బృందం అక్కడికి వెళ్లిందని అన్నారు. ఆ సమయంలో వారిపై దాడిచేసి గాయపరిచారని, ఈ విషయాన్ని తానే స్వయంగా రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డికి ఫోన్ చేసి తెలియజేశానని అన్నారు. దాడి చేసింది ఎవరైనా సరే కేసు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించానని అన్నారు. కానీ సీఐ తనతో పరుషంగా మాట్లాడారని, ఇసుకాసురులపై కేసు నమోదు చేయడానికి సీఐకి ఎందుకు మనసు రావడం లేదో తనకు అర్థం కావడం లేదని అన్నారు. ఎమ్మెల్యే అయిన తననే సీఐ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుంటే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అందుకే రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేయాల్సి వచ్చిందని అన్నారు. అక్రమ ఇసుక రవాణాకు తాము వ్యతిరేకమని తమ వారైనా సరే వదిలిపెట్టమని హెచ్చరించారు. ఇలాంటి పనులు మానుకోవాలని కోరారు.



పారదర్శకంగా

బదిలీలు

- కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఆగస్టు 27: జిల్లాలో ఉద్యోగుల బదిలీలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. బదిలీలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. నిబంధనలు తెలియకపోతే జీఓ చూసి తెలుసుకోవాలని సూచించారు. విభాగాలవారీగా, సీనియారిటీ ప్రాతిపదికన బదిలీలలో ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అన్ని ఖాళీలను వివరణాత్మకంగా ప్రదర్శించాలని, ఆ తర్వాత అభ్యంతరాలు స్వీకరించాలని సూచించారు. బదిలీల ప్రక్రియలో మానవత్వం కోణాన్ని మరిచిపోకూడదని అన్నారు. జేసీ శివనారాయణ శర్మ, డీఆర్వో రామకృష్ణారెడ్డి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ పాల్గొన్నారు.

అమృత్ పనులను వేగవంతం చేయండి

నగర, పట్టణ ప్రాంతాలలో అమృత్ పథకం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, పట్టణ రవాణా, పార్కులు వంటి పౌర సౌకర్యాలను అమృత్ పథకం కింద కల్పిస్తున్నామని తెలిపారు. ప్రాధాన్యక్రమంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, మున్సిపల్ ఆర్డీ, నగరపాలిక కమిషనర్ పీవీవీఎస్ మూర్తి, పబ్లిక్‌హెల్త్ ఈఈ సతీష్ తదితరలు సమీక్షలో పాల్గొన్నారు.

వైద్యం చేయరుగానీ.. పౌడర్ చల్లుతారా..?

వైద్య సిబ్బందిపై కౌసర్ కుటుంబం ఆగ్రహం

బాలిక మృతికి వైద్యులే కారణమని ఆందోళన



ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు



తన కూతురు మృతి పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాలిక తండ్రి

కణేకల్లు, ఆగస్టు 27: 'వైద్యం సరిగా చేయలేదుగానీ.. మా ఇంటి వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు వస్తారా..? బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉంటే వచ్చి వీడియోలు తీస్తారా..?' అంటూ పీహెచ్‌సీ సిబ్బందిపై డెంగీతో మృతిచెందిన ముజ్నా కౌసర్ కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కూతురికి స్వీపర్‌తో సెలైన్ ఎక్కించి చంపేశారని మండిపడ్డారు. యర్రగుంటకు చెందిన పీరావలి కూతురు కౌసర్ డెంగీతో సోమవారం మృతిచెందింది. వారి ఇంటి వద్ద పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు ప్రయత్నించారు. దీంతో కౌసర్ తండ్రి, కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగారు. ఆ తరువాత ఆసుపత్రి వద్దకు వెళ్లి సిబ్బందితో గొడవ పడ్డారు. సరైన వైద్యం అందని కారణంగానే తమ కూతురు పరిస్థితి విషమించిందని, ఆ తరువాత ఆర్డీటీ ఆస్పత్రికి, బళ్లారికి తరలించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహించిన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఎస్ఐ శంకర్‌రెడ్డి అక్కడికి వెళ్లి బాధితులకు నచ్చజెప్పారు. సమస్య ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. కౌసర్‌ను శనివారం ఆసుపత్రికి తీసుకువచ్చారని, ప్రథమ చికిత్స తరువాత బళ్లారికి లేదా బెంగళూరుకు వెళ్లి మెరుగైన వైద్యం చేయించాలని సూచించామని డాక్టర్ విజయ్ కుమార్ నాయక్ అన్నారు. కానీ వారు వెళ్లకుండా ఆదివారం కూడా ఆసుపత్రికి వచ్చారని, హెడ్‌నర్సుకు చెప్పి సెలైన్ ఎక్కించామని తెలిపారు. ఆ రోజు సాయంత్రమే కౌసర్‌కు ఫిట్స్ వచ్చాయని, దీంతో వారు ఆర్డీటీ ఆస్పత్రికి, ఆ తర్వాత బళ్లారికి తీసుకువెళ్లారని అన్నారు.

మురిపించి.. ముంచిన మిరప


- భారీగా పడిపోయిన ధర
- వారం కిందట కిలో రూ.28
- ప్రస్తుతం రూ.5
- కూలీల ఖర్చు కూడా రాదంటున్న రైతులు



విరగ్గాసిన మిరపకాయలు

యాడికి, ఆగస్టు 27: ధర బానే ఉంది. దిగుబడి కూడా బాగా వచ్చింది. పెట్టుబడులు పోగా వచ్చిన సొమ్ముతో అప్పులు, ఇంటి అవసరాలు తీర్చుకోవచ్చని ఆశించిన పచ్చిమిరప రైతులకు నిరాశే ఎదురవుతోంది. వారం కిందటి వరకు ఉన్న ధర ప్రస్తుతం భారీగా పడిపోవడంతో మరిన్ని అప్పులు మూటగట్టుకోవాల్సిందేనని పంట సాగు చేసిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరా మిరప సాగుకు రూ.60వేల వరకు పెట్టుబడి పెట్టారు. పంటకోత సమయంలో ధరలు పూర్తిగా పతనమయ్యాయి. దీంతో కోతకు వచ్చిన పంటను కోయాలా లేక అలాగే వదిలేయాలో అర్థం కాని పరిస్థితిలో రైతుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలో పండిన పచ్చి మిర్చిని గుత్తి, తాడిపత్రి, ప్యాపిలి, అనంతపురం మార్కెట్‌లకు తరలిస్తుంటారు. వారంరోజుల క్రితం వరకు కిలో పచ్చి మిరప రూ.28 పలికింది. ఇదే ధర కొనసాగితే లాభాలు పొందవచ్చు అనుకున్న రైతులకు హఠాత్తుగా తగ్గిన ధరలు నిరాశను మిగిల్చాయి. మండలంలోని ఒక రైతు ఇటీవల ప్యాపిలి మార్కెట్‌కు 50కిలోల మిరప విక్రయానికి తీసుకువెళ్లాడు. అక్కడ వ్యాపారి రూ.300కు అడిగాడు. మా రేటు ఇదే.. ఇష్టం ఉంటే అమ్మవచ్చు లేదంటే వెనుకకు తీసుకువెళ్లవచ్చుఅని చెప్పాడంట. మిరపకాయలు కోత కోసిన కూలి డబ్బులు రవాణా చార్జీలు కూడా దక్కవని రైతు ఆవేదన వ్యక్తం చేసినా మారేటు ఇంతే అని వ్యాపారులు తెగేసి చెప్పడంతో చేసేదేమిలేక రూ.300కే విక్రయించి తిరిగి వచ్చినట్లు రైతు తెలిపాడు.

రూ.1.2లక్షలు ఖర్చుచేశా: సురేష్, రాయలచెరువు



రెండెకరాల్లో మిరప సాగు చేశా. రూ.1.2లక్షలు పెట్టుబడి పెట్టా. వారం కిందట కిలో మిరప రూ.28 పలికింది. మొదటికోతలో రూ.30వేలు వచ్చింది. ఇప్పుడు రెండో కోత కోయాలి. ధరలు పూర్తిగా పతనమయ్యాయి. కిలో మిరప రూ.5ల నుంచి 8రూపాయల వరకు మాత్రమే అడుగుతున్నారు. ధరలు ఇలాగే కొనసాగితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. మార్కెట్‌కు మిరప దిగుబడి అధికంగా రావడంతోనే ఈ పరిస్థితులు నెలకొన్నాయి.

అధిక దిగుబడులవల్లే: శేఖర్, రాయలచెరువు



రైతుల వద్ద కిలో మిర్చి ధర రూ.5 నుంచి రూ.6 వరకు మాత్రమే కొంటున్నారు. మిరప ధరలు పూర్తిగా పడిపోయాయి. వారం రోజుల కిందట కిలో మిర్చి రూ.28 ధర పలికింది. ప్రస్తుతం రూ.5 ధర పలుకుతుండటానికి అధిక దిగుబడులే ప్రధాన కారణం. పంట సాగుకు అయ్యే పెట్టుబడులను పక్కన పెడితే మిరపకాయల విక్రయ రవాణా ఖర్చు, కూలీల డబ్బులకు వచ్చిన రైతు సంతోషపడాల్సి వస్తోంది.



మిరప పంట

నేడు మునిసిపాలిటీలో బల ప్రదర్శన

స్టాండింగ్ కౌన్సిల్ ఎంపికలో హైటెన్షన్

కీలకం కానున్న సీపీఐ కౌన్సిలరు ఓటు



గుంతకల్లు మునిసిపాలిటీ

గుంతకల్లు, ఆగస్టు 27: పురపాలక సంఘం స్టాండింగ్ కౌన్సిల్ న్యాయ సలహాదారు నియామకం విషయంగా బుధవారం మునిసిపల్ సమావేశంలో టీడీపీ, వైసీపీ మధ్య బల ప్రదర్శన జరగనుంది. గతంలో నియమించిన స్టాండింగ్ కౌన్సిల్ న్యాయ సలహాదారుగా జీపీ తిమ్మారెడ్డి రాజీనామా చేయడం తో ఆ పోస్టు నియామకానికి కౌన్సిల్ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ నెల 13వ తేదీన దరఖాస్తు గడువు ముగియడంతో బుధవారం నిర్వహించే సాధారణ సమావేశంలో ఈ పోస్టు నియామకం చేపట్ట నున్నారు. కౌన్సిల్‌లో వైసీపీ సభ్యులు అధికంగా, టీడీపీ కౌన్సిలర్లు తక్కువగా ఉండేవారు. కానీ గత వారం వైసీపీకి చెందిన కొందరు కౌన్సిలర్లు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరగా టీడీపీ, వైసీపీ బలాలు సరిసమానంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తటస్థంగా ఉన్న సీపీఐ కౌన్సిలరు ఓటు కీలకం కానుంది.

టీడీపీకి అనుకూల పరిస్థితులు

గుంతకల్లు మునిసిపాలిటీలో 37 వార్డులుండగా, గత పురపాలక ఎన్నికల్లో వైసీపీకి 29, టీడీపీకి 7, సీపీఐకి 1 స్థానం లభించింది. ఈ పరిస్థితుల్లో రెండున్నర నెలల కిందట ఎన్నికల సందర్భంగా నలుగు రు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. అలాగే ఇటీవల స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో గత వారం ఏడుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం 18కి పెరిగింది. వైసీపీ నుంచి ఇలా మొత్తం 11 మంది టీడీపీలో చేరడంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం 18కి పడిపోయింది. ఎమ్మెల్యే తన ఎక్స్ అఫిషియో సభ్యత్వాన్ని గుంతకల్లు పురపాలక సంఘంలోనే నమోదు చేసుకున్నందున టీడీపీ సభ్యుల సంఖ్య 19కి పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో సీపీఐకి చెందిన 26వ వార్డు కౌన్సిలరు లక్ష్మి కీలకం కానున్నారు. ఆమె టీడీపీ పక్షాన నిలిచిలినా లేదా గైర్హాజరైనా పదవి టీడీపీకి చెందిన న్యాయవాది కృష్ణారెడ్డికి లభిస్తుంది. ఆమె వైసీపీ వైపు మొగ్గితే మరలా బలాబలాలు సమం అవుతాయి. అయితే వైసీపీకి చెందిన కౌన్సిలర్లు కొందరు గైర్హాజరు కావచ్చని సమాచారం. అలా జరిగితే టీడీపీకి అనుకూల పరిస్థితులు నెలకొంటాయి.

పోటీతోనే వైసీపీకి కష్టకాలం

సార్వత్రిక ఎన్నికల తర్వాత వైసీపీ ప్రభుత్వం పోయి, టీడీపీ అధికారంలోకి రావడంతో స్టాండింగ్ కౌన్సిల్ న్యాయ సలహాదారు పదవిలో ఉన్న తిమ్మారెడ్డి నైతిక బాధ్యతతో రాజీనామా చేశారు. ఖాళీ అయిన పదవికి టీడీపీకి చెందిన న్యాయవాది కృష్ణారెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. అధికార పార్టీకి చెంది న వ్యక్తి కావడం, ఎమ్మెల్యే సిఫారసు ఉండటంతో ఆయనకే ఆ పదవి వస్తుందని అందరూ భావించారు. కాగా కౌన్సిల్‌లో బలం ఉన్నప్పుడు ఎందుకు వదిలెయ్యాలన్న ఉద్దేశంతో వైసీపీ నాయకులు న్యాయవాది గోపాల కృష్ణను బరిలోకి దింపారు. దీంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. పోటీలో ఎలాగైనా పంతం నెగ్గించుకోవాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే వైసీపీ కౌన్సిలర్లను టీడీపీలోకి ఆహ్వానించారు. పోటీలో నిలపకపోయి ఉంటే వైసీపీకి ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదన్న చర్చ జరుగుతోంది. కాగా కౌన్సిల్‌లో టీడీపీ బలం పెరిగిపోవడంతో ఇక ప్రయోజనం లేదని న్యాయవాది గోపాల కృష్ణ తన దరఖాస్తును ఉపసంహరించుకునే అవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనా కౌన్సిల్‌లో అవసరమైతే హాజరుకావడానికి ఎమ్మెల్యే జయరాం అందుబాటులో ఉండనున్నారు. మొత్తానికి బుధవారం కౌన్సిల్ సమావేశం హాట్‌హాట్‌గా నడిచే అవకాశాలు ఉన్నాయి.

అత్యవసరంలో.. అత్యుత్సాహం

- అధికారుల తీరుతో వైద్య సేవలకు ఆటంకం
- నాగముని మృతితో మంత్రి సవితకు అపప్రథ
- బాధ్యతగా వ్యవహరించినా.. బాధాకర సంఘటన

అనంతపురం టౌన్, ఆగస్టు 27: నగరంలోని బీసీ హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థి తేజ(17) సోమవారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీసీ శాఖ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే సవిత నేరుగా ఆస్పత్రికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులు, సహ విద్యార్థులు, వైద్యులు, పోలీసులతో మాట్లాడారు. అది ఆత్మహత్య కాదని విద్యార్థి తండ్రి అనుమానం వ్యక్తం చేయడంతో సమగ్రంగా దర్యాప్తు చేయాలని, అనుమానాలను నివృత్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా సర్వజన వైద్యశాల అత్యవసర విభాగంలో సోమవారం రాత్రి కొన్ని గంటలపాటు రద్దీ ఏర్పడింది. ఇదే సమయంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి నుంచి రెఫర్‌పై మెరుగైన వైద్యం కోసం వచ్చిన నాగముని(54) అంబులెన్స్‌లోనే ప్రాణాలు విడిచారు. మంత్రి, శింగనమల ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ తదితరుల రాక కారణంగా అత్యవసర

మంత్రే కారణమా..?

మంత్రి సవిత ఆస్పత్రికి రావడంతోనే నాగమునికి సకాలంలో వైద్యం అందలేదని కొందరు విమర్శలకు దిగారు. తన శాఖ పరిధిలో జరిగిన ఘటన గురించి తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి రావడం మంత్రి బాధ్యత. ఒకవేళ మంత్రి అక్కడికి రాకపోయుంటే.. ఆమెపై ఇంకోరకమైన విమర్శలకు దిగేవారు. మంత్రికి ఆమాత్రం బాధ్యత లేదా అని ప్రశ్నించేవారు. ఇదంతా రాజకీయం. కానీ ఆస్పత్రి ఆవరణలో నాగముని మరణం క్యాజువాలిటీ దుస్థితికి, వీఐపీల పర్యటన సమయంలో అధికారులు ప్రదర్శించే అత్యుత్సాహానికి అద్దం పడుతోంది. హాస్టల్ విద్యార్థి తేజను రాత్రి 7.40 సమయంలో ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు.. 8.15 సమయంలో మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆ వెంటనే విద్యార్థి మృతదేహాన్ని మార్చురీకి తరలించాలి. కానీ గంటల తరబడి అత్యవసర విభాగంలోనే ఉంచారు. సాధారణ పరిస్థితుల్లోనే మంచానికి ముగ్గురు నలుగురు రోగులు అక్కడ కనిపిస్తారు. వారికి ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు, సిబ్బంది తంటాలు పడుతుంటారు. అలాంటి చోట మృతదేహాన్ని గంటల తరబడి ఉంచడానికి కారణం ఎవరు..? గతంలోనూ క్యాజువాలిటీలో ఓ మృతదేహం ఉన్న పడకపై గంటల తరబడి ఇద్దరు యువకులకు వైద్యం చేశారు. మృతదేహాలను గంటల తరబడి పడకలపై ఉంచడం ఆనవాయితీగా పెట్టుకున్నారా..?

క్యాజువాలిటీలో గంటల తరబడి మృతదేహం



జిల్లా ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ బాధితులకు చికిత్స అందించే క్యాజువాలిటీ విభాగం ఇదే

విభాగం వద్ద విపరీతమైన రద్దీ ఉన్నింది. దీంతో అంబులెన్స్‌లో ఉన్న నాగమునికి సకాలంలో వైద్యం అందలేదు. సుమారు అరగంటపాటు నాగముని గురించి వైద్యులు, సిబ్బంది పట్టించుకోలేదన్న విమర్శలు వచ్చాయి.

అధికారుల అత్యుత్సాహం

విద్యార్థి మృతదేహాన్ని అత్యవసర విభాగం నుంచి మార్చురీకి తరలించి ఉంటే.. మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు అక్కడికే వెళ్లి చూసేవారు. బాధితులతో అక్కడే మాట్లాడేవారు. కానీ, అత్యవసర వైద్యసేవలు అందేచోట అధికారులు సీన్ క్రియేట్ చేశారు. విద్యార్థి మృతదేహాన్ని మార్చురీకి తరలించబోతుంటే.. డీఎస్పీ స్థాయి పోలీసు అధికారి ఒకరు అత్యుత్సాహం ప్రదర్శించారు. 'మంత్రి వస్తున్నారు.. ఇక్కడే ఉంచండి..' అని వైద్యులు, సిబ్బందిని ఆయన వారించారు. పైగా భద్రత పేరిట క్యాజువాలిటీ మెయిన్ డోర్‌నే మూసివేయాలని కూడా సూచించారు. అత్యవసర రోగులు వస్తుంటారని, అలా చేయొద్దని మీడియా ప్రతినిధులు కొందరు సూచించడంతో మిన్నకుండిపోయారు. మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ తదితరులు రాత్రి 10-40 గంటలకు ఆస్పత్రికి వచ్చారు. 11-30 గంటల వరకూ అక్కడే ఉన్నారు. అంటే.. విద్యార్థి మృతదేహాన్ని రాత్రి 8.15 నుంచి సుమారు మూడున్నర గంటలపాటు అత్యవసర విభాగంలోనే ఉంచారు. ఇది మిగిలిన రోగులకు, వైద్యులు, సిబ్బందికి ఇబ్బంది కలిగిస్తుందన్న ఆలోచన అధికారులు చేయలేదు. అత్యవసర వైద్యం కోసం వచ్చేవారికి రద్దీ కారణంగా ఇబ్బందులు తలెత్తుతాయని అధికారులకు తెలియదా..? అత్యుత్సాహం ప్రదర్శించి మంత్రికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించారు.

తేలేదాకా పోస్టుమార్టం వద్దు: కుటుంబ సభ్యులు

అనంతపురం ప్రెస్‌క్లబ్: 'మా బిడ్డ మృతిపై అనుమానాలున్నాయి. ఏవరో ఏదో చేశారు. నిజానిజాలు తేల్చేవరకూ పోస్టుమార్టం చేయనివ్వం' అంటూ విద్యార్థి తేజ కుటుంబ సభ్యులు సర్వజన వైద్యశాల ఎదుట రోడ్డుపై మంగళవారం ఆందోళనకు దిగారు. పోస్టుమార్టం నిర్వహించేందుకు వైద్యాధికారులు, తహసీల్దారు తదితరులు మార్చురీ వద్దకు వచ్చారు. అప్పటికే పాలవాయి గ్రామం నుంచి తేజ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు. తేజ మృతిపై అనుమానాలున్నాయని, నిజాలే తేలేవరకూ పోస్టుమార్టం చేయవద్దని కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. పోలీసుల జోక్యంతో గందరగోళం ఏర్పడింది. అక్కడి నుంచి బాధితులు ఆస్పత్రి బయటకు వచ్చి రోడ్డుపై నిరసనకు దిగారు. దాదాపు గంటపాటు ఆందోళన కొసాగింది. డీఎస్పీ ప్రతాప్‌కుమార్ వారికి సర్దిచెప్పి, పోస్టుమార్టానికి ఒప్పించారు. ఆందోళన కారణంగా ఉదయం జరగాల్సిన పోస్టుమార్టం మధ్యాహ్నం 2.30 గంటలకు ముగిసింది. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని విద్యార్థి కుటుంబ సభ్యులకు డీఎస్పీ హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థి మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు.



ప్రభుత్వ ఆస్పత్రి బయట రోడ్డుపై నిరసన చేపట్టిన విద్యార్థి కుటుంబ సభ్యులకు సర్ది చెప్తున్న పోలీసులు

అంబులెన్స్‌లోకి వెళ్లి పరీక్షించారు



ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగముని పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. రాత్రి 10-50 గంటల సమయంలో అంబులెన్స్ వచ్చింది. ఆ సమయంలో క్యాజువాలిటీలో మంత్రి, కలెక్టరు, ఎస్పీ తదితరులు విద్యార్థి తేజ మృతదేహాన్ని పరిశీలిస్తున్నారు. సీరియస్ పేషెంట్ వచ్చారని తెలియగానే డ్యూటీ డాక్టర్ కార్తీక్ రెడ్డి 11 గంటల సమయంలో అంబులెన్స్‌లోకి వెళ్లి పరీక్షించారు. అప్పటికే నాగముని బాడీ నుంచి పల్స్ కనిపించలేదు. 11-15 గంటలకు క్యాజువాలిటీలోకి తీసుకువచ్చాం. ఈసీజీ తీసి మృతిచెందినట్లు నిర్ధారించాము. అంబులెన్స్‌లో ఇక్కడికి వచ్చేలోగానే నాగముని చనిపోయి ఉండొచ్చు. చికిత్స విషయంలో నిర్లక్ష్యం చేయలేదు. విద్యార్థి తేజ మృతదేహాన్ని మార్చురీకి తరలించేందుకు తల్లిదండ్రులు, బంధువులు ఒప్పుకోలేదు. అప్పటికి మంత్రి వస్తున్నారని తెలియడంతో సందర్శించి వెళతారని క్యాజువాలిటీలోనే ఉంచాము.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్

స్వీయ నియంత్రణ పాటించాలి..

బీసీ విద్యార్థి అనుమానాస్పద మృతితో మంత్రి సవిత వెంటనే స్పందించారు. న్యాయం చేస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. ఇంత బాధ్యతగా వ్యవహరించినా.. ఆమె ఆస్పత్రిలో ఉన్న సమయంలో రద్దీ కారణంగా ఒకరికి సకాలంలో వైద్యం అందలేదని, అందుకే ప్రాణం పోయిందన్న విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. రాజకీయాల్లో ఉన్న వ్యక్తులకు ఇలాంటివి సాధారణమే అయినా, ప్రజా ప్రతినిధులు తమ పర్యటనల సందర్భంలో స్వీయ నియంత్రణ పాటించాలి. వారి మెప్పుకోసం అధికారులు చేసే హడావుడిపై దృష్టి సారించాలి. భారీ కాన్వాయ్, పదుల సంఖ్యలో అనుచరులు వెంట లేకుండా చూసుకోవాలి. అప్పుడే ఇలాంటి సమస్యలు, విమర్శలు ఎదురుకాకుండా ఉంటాయి. జనం మెప్పు పొందగలుగుతారు. సీఎం చంద్రబాబు మడకశిర పర్యటనను ఎంతో సాదాసీదాగా ముగించారు. తమ నాయకుడిని మంత్రులు స్ఫూర్తిగా తీసుకోవాలి.

న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే అమిలినేని

అనంతపురం ప్రెస్‌క్లబ్: తేజ మృతిపై సమగ్ర విచారణ జరిపిస్తామని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విద్యార్థి కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల మార్చురీలో తేజ మృతదేహాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడే ఉన్న పోలీసులు, బీసీ సంక్షేమశాఖ అధికారులతో మాట్లాడారు. విద్యార్థి తల్లిదండ్రులను ఓదార్చి.. రూ.1.50 లక్షల ఆర్థికసాయాన్ని అందజేశారు. విద్యార్థి మృతికి గల కారణాలు ఏమిటో దర్యాప్తు చేయించాలని ఎస్పీని కోరుతామని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, అండగా ఉంటామని అన్నారు.



విద్యార్థి తల్లిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

శేఖర్ కుటుంబానికి అండగా ఉంటాం

- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు
- పలువురు జర్నలిస్టుల నివాళి



శేఖర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కుటుంబసభ్యులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 27: ఇటీవల గుండెపోటు మృతి చెందిన టీవీ - 5 కెమెరామన్ శేఖర్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక రాంనగర్‌లోని ఓ హోటల్‌లో టీవీ- 5 కెమెరామన్ శేఖర్ సంతాప సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, టీడీపీ నాయకులు ప్రసన్నాయపల్లి శ్రీనివాసులు, గంగారామ్, సీనియర్ జర్నలిస్టులు మార్కండేయులు, ప్రభాకర్‌నాయుడు, నాగరాజు, రసూల్, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి, ఏబీఎన్ జిల్లా ఇన్‌చార్జి సురేష్, టీవీ - 5 చంద్ర, సాక్షి శివారెడ్డి, టీవీ- 9 నరేష్, ఐన్యూస్ రామాంజనేయులు, ఎన్‌టీవీ శ్రీనివాసులు, 10టీవీ జగదీష్, కెమెరామెన్ విజయ్, బాబ్జాన్ తదితరులు శేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే సురేంద్ర బాబు మాట్లాడుతూ జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లి తగు నిర్ణయం తీసుకునేలా చొరవ చూపుతానన్నారు.

- టీవీ - 5 శేఖర్ కుటుంబ సభ్యులకు పలువురు ఆర్థిక సాయం అందించారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.1.5 లక్షలు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తరఫున రూ.25వేలు, గౌస్‌మొద్దీన్ రూ.20వేలు, ప్రసన్నాయపల్లి శ్రీనివాసులు రూ.50వేలు, జిల్లా టీవీ -5 జర్నలిస్టుల బృందం రూ.లక్ష, ఇతర జిల్లాల టీవీ-5 ప్రతినిధుల బృందం రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు.



సంతాపం వ్యక్తం చేస్తున్న నాయకులు, జర్నలిస్టులు

రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయండి

అనంతపురం అర్బన్, ఆగస్టు 27: జిల్లా వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో డ్రిప్ పరికరాల కోసం రైతులతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక ఏపీఎంఐపీ పీడీ కార్యాలయం లోని తన చాంబర్‌లో ఏపీడీ ఫిరోజ్ ఖాన్‌తో కలిసి డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ ఏడాది జిల్లాకు 37500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింకర్ల మంజూరు కోసం ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రిజిస్ట్రేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏపీఎంఐపీ అధికారులతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు.

ఇసుక రవాణా చేయొద్దు

- సొంత పార్టీ నాయకులకు జేసీపీఆర్ హుకుం

అనంతపురం, ఆగస్టు27 (ఆంధ్రజ్యోతి): 'నియోజకవర్గవ్యాప్తంగా ఇసుక అక్రమంగా రవాణా చేసేందుకు వీల్లేదు. ఇసుక రవాణా చేసి నాకు దూరం కావద్దు' అని సొంత పార్టీ నాయకులను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. ఇసుక రవాణా ఆపాలని ఇదే తన చివరి హెచ్చరికని సొంత పార్టీ నాయకులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన హైదరాబాదు నుంచి మీడియాకు వీడియో సందేశాన్ని పంపారు. 'నియోజకవర్గంలో 25 మంది దాకా ఇసుకను రవాణా చేసేవాళ్లున్నారు. వారంతా నాకు ఆప్తులు. ఐదేళ్లు నాతో పాటు కష్టపడిన వారే. మళ్లీ మళ్లీ చెబుతున్నా. ఇసుక రవాణా చేయడం మానుకోండి. మీకొక్కరికేనా డబ్బులు. నియోజకవర్గంలో 2.5 లక్షల మంది ఓటర్లుంటే 25 మందికే డబ్బులా..? దూరం చేసుకోవద్దండి. దయచేసి చెబుతున్నా. ఇసుక రవాణా చేయడం మానేయండి. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణాను ఆపేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశా' అన్నారు. ఆ క్రమంలో పోలీసులు తనను ఒకరోజు ఉదయం పట్టుకొని జిల్లా అంతా తిప్పారన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ రోజు పార్టీ నాయకులు, కార్యకర్తలు స్టేషన్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతోనే పోలీసులు తనను వదిలి పెట్టినట్లు వివరించారు. ఇసుక రవాణాకు టిప్పర్లు పంపిస్తే అవి బయటకు రావు. ఎక్కడైనా పోయి తోలుకోండి. నా నియోజకవర్గంలో తోలేందుకు వీలులేదని టిప్పర్ యజమానులను హెచ్చరించారు. ఏం మీరే డబ్బులు సంపాదించకో వాల్నా.. నేనెంత పోగొట్టుకున్నాను. అయితే ఇలాగే నన్ను చేసుకోమంటారా..? అని ఇసుక రవాణాదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక అవసరమైతే మున్సిపాల్టీ ద్వారా తోలిస్తా. ఎన్ని పనులైనా చేసుకోవచ్చు. ఇసుక రవాణాను మాత్రం నేనొప్పుకోను. మీరంతా నాకు కావాల్సిన వాళ్లేనన్నారు. మీకు ఇసుక ఎట్ల అమ్మాలో తెలియదు. మీరు ఎవరిని ఉపయోగించుకుంటున్నారో నాకు తెలుసు. పోయిన వైసీపీ ప్రభుత్వంలో ఇసుక ఎట్ల అమ్మాలో ఆ పార్టీ వాళ్లకే తెలుసు. వాళ్ల సహాయం లేకపోతే మీరు ఒక్క ట్రిప్పు ఇసుక కాదు కదా... ట్రాక్టర్ ఇసుక అమ్ముకోలేరన్నారు. ఇంటి నిర్మాణానికి... అభివృద్ధి పనులకు కావాలంటే ఇసుక తోలుకోండి ఎవరూ వద్దన్నారు అని ప్రశ్నించారు. తన కోసం కష్టపడిన వారికి వేరేవిధంగా మేలు చేస్తానని పార్టీ నాయకులకు అభయమిచ్చారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుక అక్రమ రవాణాపై విచారణ జరుగుతోంది. ఇప్పటికే నెల్లూరులో విచారణ జరుగుతోంది. తాడిపత్రిలోనూ జరుగుతోంది. ఇకనుంచి ఎవరూ ఇసుక తోలేందుకు వీల్లేదని ఆయన సొంత పార్టీ నేతలను తనదైన శైలిలో హెచ్చరించారు.



మాట్లాడుతున్న జేసీపీఆర్

యూపీఎస్‌తో ఉద్యోగులకు రెండు విధాలా లబ్ధి: డీఆర్‌ఎం

గుంతకల్లు, ఆగస్టు27: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టనున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)లో ఉద్యోగులకు రెండు విధాల లబ్ధి కలుగుతుందని డీఆర్‌ఎం విజయ కుమార్ పేర్కొన్నారు. స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలో మంగళవారం ఉదయం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ నూతన పింఛను విధానంపై కేంద్ర ఉద్యోగులకు వ్యతిరేకత ఉన్న కారణంగా వారి సమస్యల పరిష్కారానికి కేంద్రం యూనిఫైడ్ పెన్షన్ స్కీంను ప్రవేశపెడుతోందన్నారు. ఇందులో ఉన్న విషయాలను పరిశీలిస్తే ఓపీఎస్ లబ్ధి తోపాటు ఎన్‌పీఎస్‌లో ఉన్న ఉపయోగాలు కూడా ఇందులో ఉన్నట్లు అర్థమౌతోందన్నారు. కేంద్ర ఉద్యోగులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీంలో పాత పింఛను మాదిరిగానే జీతంలో 50 శాతం పింఛనును కనీస మొత్తంగా ఇస్తారన్నారు. రిటైర్మెంటు సమయంలో ఎన్‌పీఎస్ ప్రకారం షేర్స్‌లో పెట్టిన ఉద్యోగుల కార్పస్ వ్యాల్యూ జీతంలో 50 శాతం కంటే ఎక్కువగా లభించే అవకాశం ఉంటే ఆ ఎక్కువ మొత్తాలనే పింఛనుగా ఇస్తారని వెల్లడించారు. ఉద్యోగి రిటైర్మెంటు కంటే ముందే చనిపోతే ఫ్యామిలీ పింఛనును 50 శాతానికి బదులు 60 శాతం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఉద్యోగికి కనీసంగా రూ.30 వేల పింఛను లభిస్తుందన్నారు. ఎన్‌పీఎస్ కింద డివిజన్‌లో 11,700 మంది ఉద్యోగులు, ఓపీఎస్ పరిధిలో 3,313 మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. సమావేశంలో సీనియర్ డీపీ జేపీ చౌహాన్, సీనియర్ ఫైనాన్స్ మేనేజరు రామిరెడ్డి, డీపీఓ కాప్రైల్ అరోరా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం విజయ కుమార్

బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 27: ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో మంగళవారం కర్నూలులో నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌కు ఇంజనీరింగ్ అధికారులు హాజర య్యారు. కొంత మందికి కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి కాగా మరి కొంతమందికి అర్ధరాత్రి వరకు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కర్నూల్ సర్కిల్ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ గాయిత్రీదేవి పర్యవేక్షణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. జోన్-4 ఇంజనీర్ల బదిలీల్లో భాగంగా అనంతపురం ఉమ్మడి జిల్లాతో పాటు కడప, చిత్తూరు, కర్నూలు జిల్లాలకు చెందిన గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈఈ, ఏఈ, డీఈలలో 5 సంవత్సరాలు పూర్తి అయిన వారు, పలు కారణాలతో రిక్వెస్ట్ పెట్టుకున్న వారు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. జిల్లాలో క్లియర్ వేకెన్సీ ఉన్న స్థానాలకు మాత్రమే బదిలీ ఉద్యోగులను కేటాయించినట్లు తెలిసింది. ఉత్తర్వులు మాత్రం నెలాఖరున వెల్లడించే అవకాశం ఉన్నట్లు పలువురు ఇంజనీర్లు చెబుతున్నారు. ప్రస్తుతానికి ప్లేస్‌మెంట్ ఖరారు అయినప్పటికీ వాటిలో మరిన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది. దీంతో నెలాఖరులో వచ్చే ఉత్తర్వులే ఫైనల్ కానున్నట్లు చర్చ జరుగుతోంది.

యూపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- జేసీ శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, ఆగస్టు 27: యూపీఎస్సీ సెప్టెంబరు 1న నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ అకాడమీ-2024 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత అధికారులతో ఆయన పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు జేసీ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జేఎన్‌టీయూ కేంద్రంగా ఆదివారం ఉదయం 9-00గంటల నుంచి 11వరకు పేపర్-1, మధ్యాహ్నం 12గంటల నుంచి 2గంటల వరకు పేపర్-2, సాయంత్రం 3గంటల నుంచి 5గంటల వరకు పేపర్-3ఒక్కో పరీక్ష నిర్వహిస్తారన్నారు. నగరంలోని కేఎస్ఆర్ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 వరకు పేపర్-2 పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మొత్తం 238మంది అభ్యర్థులు ఈపరీక్షలు రాస్తున్నారని వెల్లడించారు. అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష సమయంలో కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణపై ఆదేశాలిస్తున్న జేసీ శివనారాయణశర్మ

పెద్దాసుపత్రిలో నిర్లక్ష్యం.. మరొకరి బలి



మరణించిన ఈశ్వరయ్య

అనంతపురం ఆగస్టు 27: జిల్లా సర్వజన వైద్యశాలలో డాక్టర్లు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి ఈశ్వరయ్య (38) అనే రోగి మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, వార్డులో ఉన్న ఇతర రోగులు వైద్యులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి తిరుగుబాటుతో వార్డులో ఉన్న నర్సులు బయటకు పారిపోయారు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. మృతుడి భార్య పద్మావతి తెలిపిన మేరకు, తాడిపత్రికి చెందిన ఈశ్వరయ్య అనారోగ్యంతో మంగళవారం ఉదయం 9 గంటలకు జిల్లా సర్వజన వైద్యశాలలో అడ్మిట్ అయ్యాడు. వైద్యుల సూచన మేరకు హౌస్ సర్జన్లు ఇంజక్షన్లు, మందులు రాసిచ్చి.. బయట తెచ్చుకోమన్నారు. రోగి కుటుంబ సభ్యులు ప్రైవేటు మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసి వైద్య సిబ్బందికి ఇచ్చారు. కానీ ఎంఎం వార్డులో ఉన్న రోగికి వాటిని వినియోగించలేదు. నర్సులు సాయంత్రం ఇంజక్షన్ వేసేందుకు ప్రయత్నించారు. నరాలు దొరకలేదని చెప్పి వదిలేశారు. ఆ తర్వాత ఈశ్వరయ్య పరిస్థితి విషమించింది. వెక్కిళ్లు ఎక్కువై.. రక్తపు వాంతులు చేసుకున్నాడు. బాధితుడు విలవిలలాడుతుండటంతో డాక్టర్లను పిలిచారు. వారు వచ్చి చూసేలోగా ఈశ్వరయ్య ప్రాణాలు వదిలాడు. దీంతో రోగి కుటుంబ సభ్యులు, వార్డులో ఉన్న ఇతర రోగులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. వైద్యులు, నర్సులపై మండిపడ్డారు. వారు ఎక్కడ దాడి చేస్తారోనని వైద్యులు, సిబ్బంది వార్డు నుంచి పారిపోయారు. తన భర్త మృతికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని పద్మావతి కన్నీరు మున్నీరయ్యారు, తనకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారని, ఇళ్లలో పని చేసుకుని బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని బోరున విలపించారు. ఈ విషయం తన దృష్టికి రాలేదని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. ముదిగుబ్బకు చెందిన నాగముని సంఘటన మరువకనే ఆస్పత్రిలో మరొకరు మృతి చెందడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పది మంది ఎస్ఐల బదిలీ

అనంతపురం క్రైం: జిల్లా పరిధిలో పది మంది ఎస్ఐలను బదిలీ చేశారు. ఈ మేరకు డీఐజీ షిమోషి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
డి.శ్రీనివాస్	ధర్మవరం వన్‌టౌన్	అనంతపురం వన్‌టౌన్
ఎం.రామక్రిష్ణ	అనంతపురం వన్‌టౌన్	వీఆర్ఎస్పీ, అనంతపురం
జి.సుధాకర్‌యాదవ్	వీఆర్ ఎస్పీ, శ్రీసత్యసాయి	అనంతపురం టూటౌన్
సి.సురేంద్రబాబు	అనంతపురం టూటౌన్	వీఆర్,ఎస్పీ, అనంతపురం
వి.రాంప్రసాద్	డీసీఆర్‌బీ, అనంతపురం	అనంతపురం ఫోర్త్ టౌన్
కె.రాంబాబు	పీటీసీ, అనంతపురం	అనంతపురం రూరల్
వై.విజయ్‌కుమార్	వీఆర్, ఎస్పీ, శ్రీసత్యసాయి	ఇటుకలపల్లి పీఎస్
వై.నాగమధు	అనంతపురం ఫోర్త్‌టౌన్	కణేకల్లు పీఎస్
ఆర్.శ్రీనివాసులు	కణేకల్లు పీఎస్	వీఆర్ ఎస్పీ,అనంతపురం
బి.నబీరసూల్	గుత్తి యూపీఎస్	బొమ్మనహాళ్ పీఎస్

నగరపాలికలో అడ్డగోలు వ్యాపారం

ఒక్కో ఉద్యోగం రూ.70వేలకు... కమిషనర్ సంతకం లేకుండానే 14 మందిని వర్కర్లుగా ఎక్కించేసిన వైనం

అనంతపురం క్రైం, ఆగస్టు 27: నగరపాలికలో అడుగడుగునా అవినీతి తాండవిస్తోంది. ఎలాంటి నిబంధనలు లేకుండా అడ్డగోలు వ్యాపారం చేస్తున్నారు. కొత్తగా ఉద్యోగాలు సృష్టించి 14మంది నుంచి డబ్బులు వసూలు చేసిన బాగోతం వెలుగులోకి వచ్చింది. ఇదివరకు కమిషనర్‌గా ఉన్న మేఘస్వరూప్ కొత్తగా పారిశుధ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్‌లో గార్బేజ్ కింద వర్కర్లను తీసుకోవాలని ఆదేశించారు. అప్పటికి కోవిడ్‌లో 70 మంది, మలేరియా 33, గార్బేజ్ కింద 28 మంది మొత్తం 131 మంది పనిచేస్తున్నారు. కమిషనర్ పారిశుధ్యం పర్యవేక్షించే అధికారికి ఆ బాధ్యత అప్పగించారు. కమిషనర్ ఐదు పోస్టులు అడిగారు కదా మనం ఓ 14 మందిని సృష్టిస్తే మొత్తం రౌండ్‌ఫిగర్ 150 మంది అవుతుందని భావించారు. దీంతో కొందరు కులసంఘం నాయకులు, కొందరు మధ్యవర్తులతో బేరం నడిపారు. ఒక్కొక్కరితో రూ.70వేలు, రూ.80వేలు పుచ్చుకుని 14మందితో కలిపి మొత్తం 19మంది జాబితా సిద్ధం చేసి కమిషనర్‌కు ఫైల్ పెట్టారు. దీంతో ఏదో మతలబు జరిగిందని భావించిన కమిషనర్ ఆ ఫైల్‌పై సంతకం పెట్టలేదు.

మస్టర్ బుక్కులోకి పేర్లు

కమిషనర్ బదిలీపై వెళ్లారు. లెక్కల బేరమాడి తీసుకున్న 14 మంది పేర్లను దర్జాగా మస్టర్ బుక్‌లో ఎక్కించేశారు. ఆ ముసుగులో కొత్త ఉద్యోగాలు కాకుండా అప్పటికే పని చేస్తున్న రెగ్యులర్ వర్కర్ల స్థానంలో బదిలీ వర్కర్లుగా వారికి పని అప్పగించినట్లు సమాచారం. ఈ వ్యవహారం ముగిశాక నార్పల మండలం దుర్గంలో ఈ గ్రూపంతా డిన్నర్ పేరుతో విందు చేసుకున్నారట. కార్యక్రమానికి ఆ అధికారి చీఫ్ గెస్ట్‌గా వెళ్లారట. అక్కడ వసూలైన ముడుపులు అధికారికి 80 శాతం వారికి 20 శాతంగా పంచుకున్నారట. ఇదంతా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులే నడుపుతున్నారని, వారే డబ్బు తీసుకొని వ్యవహారం నడిపారని ప్రచారం చేశారట. చివరికి అంతా తెలిసి పరిశీలిస్తే మస్టర్ బుక్‌లో పేర్లు చూసి అవాక్కవడం వారి వంతైందట. ఈ స్థాయిలో అవినీతి జరుగుతుంటే నగరపాలిక ఉన్నతాధికారులు, పాలకవర్గం ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. కౌన్సిల్‌లో మాత్రం అవినీతిపై ఇంతెత్తున అరుస్తారు. జరిగిపోయాక ఎవరేం చేస్తారన్నట్లు జరిగిపోతోంది. దీన్ని బట్టి చూస్తే ఎవరికీ బాధ్యత ఉన్నట్లు కన్పించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్అండ్ఆర్ సమస్యను పరిష్కరిస్తా

శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న బండారు, వెంకటశివుడు యాదవ్

శింగనమల ఆగస్టు 27: ఆర్అండ్ఆర్ సమస్యకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండలంలోని ఉల్లికల్లు గ్రామాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. తొలుత పెన్నానదికి హారతి ఇచ్చారు. అనంతరం రచ్చబండ వద్ద ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై గ్రామస్థులతో మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర సమయంలోను, ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు దృష్టికి సమస్యను తీసుకువెళ్లానని, తప్పకుండా పరిష్కారం చూపుతానన్నారు. ముంపునకు గురై గ్రామం అభివృద్ధికి దూరంగా ఉందని, అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, టీడీపీ నాయకులు రంగారెడ్డి రఘు, చలమయ్య, నాగరాజు ఆదినారాయణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నియోజకవర్గ రూపురేఖలు మారుస్తా

నియోజకవర్గ రూపురేఖలను మారుస్తానని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఆర్టీసీ బస్టాండును, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. ఐదేళ్లల్లో నియోజకవర్గ రూపురేఖలను మారుస్తానన్నారు. టీడీపీ నాయకులు వెంకటేశ్, నాగముని, చంద్రరాయల్, డేగల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

శింగనమలలోని ఆత్మసీతారామస్వామి ఆలయంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ హాజరై పూజలు చేశారు.

ఎస్పీని కలిసిన బండారు

గార్లదిన్నె: జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎస్పీ జగదీష్, ఏఎస్పీ రమణమూర్తిని శింగనమల శాసనసభ్యురాలు బండారు శ్రావణిశ్రీ కలశారు. నియోజకవర్గ పరిస్థితులపై ఎమ్మెల్యే చర్చించారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించం

- గడ్డితింటూ తాగునీటి కార్మికుల వినూత్న నిరసన

గార్లదిన్నె, ఆగస్టు 27: తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించబోమని సత్యసాయి తాగునీటి కార్మికుల సంఘం ఐఎఫ్‌టీయూ హెచ్చరించింది. కల్లూరులోని పంపుహౌస్ వద్ద సత్యసాయి తాగునీటి కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు గడ్డి తింటూ మోకాళ్లపై నిల్చుని నిరసన చేశారు. సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలుపుతుంటే సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైన స్పందించాలని కోరారు. సత్యసాయి తాగునీటి సప్లయి కార్మిక సంఘం బాషా, నాగభూషణం, మల్లరాయుడు, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు నిరసనలో పాల్గొన్నారు.
నార్పల: బీ పప్పూరు పంప్‌హౌస్ వద్ద సత్యసాయి తాగునీటి కార్మికులు పచ్చిగడ్డి తింటూ నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు నాగభూషణ, అంకన్న, పుల్లనాయుడు, వెంకటరమణ, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కల్లూరు పంపుహౌస్ వద్ద గడ్డితింటూ నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టండి

ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 27: ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టి, యూరియా, డీఏపీ కొరతను నివారించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రైతుసంఘం జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉండకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించడం దారుణమని విమర్శించారు. వరినాట్లు ప్రారంభమవడంతో కొన్ని ప్రాంతాల్లో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, రైతులు ఎరువుల దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్నవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'సిబ్బంది సమస్యలు పరిష్కరించండి'

అనంతపురం అర్బన్, ఆగస్టు 27: జిల్లాలో పనిచేస్తున్న వ్యవసాయ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఉమ్మడి అనంత జిల్లా వ్యవసాయశాఖ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ నూతన కమిటీ నాయకులు కోరారు. మంగళవారం ఆ సంఘం ఉమ్మడి అనంత జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, కార్యదర్శి బాలాజీ నాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ తదితరులు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశులు, రాజగోపాల్, రంగస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శులు నరసింహులు, సల్మా, సహాయ కార్యదర్శులు ప్రభాకర్, వీరేష్‌బాబు, హఫీజ్, పద్మావతి, కోశాధికారి ప్రాణేష్‌రావు, ఈసీ సభ్యులు శ్రీనివాసులు, స్టేట్ కౌన్సిలర్ పుల్లయ్య పాల్గొన్నారు.

సింగరాజుకు ఘననివాళి

అనంతపురం విద్య, ఆగస్టు 27: సింగరాజు రామకృష్ణయ్య కృషితోనే ప్యాప్టో పురుడుపోసుకుందని ఏపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఉపాధ్యాయభవన్‌లో సింగరాజు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరాజు రామకృష్ణయ్య ఉపాధ్యాయులకు, విద్యారంగానికి సేవలు అందించారన్నారు. ఆయన సేవలు సదా స్మరణీయం అంటూ కొనియాడారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు సర్దార్, వన్నప్ప, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, జయ సూర్యానారాయణ, అడివిరాజు, నరసింహ, హిమగిరి, ప్రసాద్ పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 27: జిల్లాస్థాయి పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలను ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించారు. జూనియర్ బాలికల విభాగంలో సౌమ్య, రమాదేవి, అంజుమ్, హేమలత, ప్రత్యూష, పూజ, స్రవంతి, నిఖిత, అలేఖ్య ఎంపికయ్యారు. సబ్‌జూనియర్స్ బాలురలో అజయ్, వినయ్, రామ్‌చరణ్, గణేష్‌రెడ్డి, ముక్తిఆయర్, అమర్, మణిశంకర్, లక్ష్మణ్ ఉన్నారు. జూనియర్స్ బాలురలో చైతన్య, హనుమేష్, మంతేష్, సాగర్, హరీష్, రాము, యువకిరణ్ రెడ్డి ఎంపికయ్యారు. వీరు సెప్టెంబరు 14, 15వ తేదీల్లో అమలాపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

కార్మికుల సమస్యలు పట్టవా?: సీఐటీయూ

అనంతపురం క్రైం, ఆగస్టు 27: కార్మికుల సమస్యలు పట్టించుకోరా అని సీఐటీయూ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం నగరపాలిక ఆవరణలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడుతూ కార్మికుల సంఖ్య పెంచాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పారిశుధ్య కార్మికులకు సకాలంలో పనిముట్లు ఇవ్వాలన్నారు. అవినీతి వైపు ఉన్న ఎంహెచ్ఓ విష్ణుమూర్తి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బుక్కరాయసముద్రం దేవరకొండ పక్కనున్న మిగులు భూమిలో గుడిసెలు వేసుకున్న కార్మికులకు తక్షణమే రెండు సెంట్ల ప్రకారం స్థలం కేటాయిస్తూ వారికి పక్కా ఇల్లు కేటాయించాలని కోరారు. అనంతరం ఈఈ సుధారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, బండారిస్వామి పాల్గొన్నారు.

'నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు'

గార్లదిన్నె, ఆగస్టు 27: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గార్లదిన్నె ప్రాథమిక వైద్యాధికారి గౌతమి ఆర్ఎంపీలను హెచ్చరించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీఎస్‌లతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేస్తున్నారన్నారు. రోగులకు హైడోస్ యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్స్, నొప్పికి సంబంధించిన మందులు ఇవ్వడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రక్త పరీక్షలు, లింగ నిర్ధారణ, అబార్షన్లు, కాన్పులు చేయకూడదని ఆదేశించారు. సమావేశంలో యర్రగుంట్ల వైద్యాధికారి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

పంటల సాగుపై శిక్షణ

అనంతపురం రూరల్, ఆగస్టు 27: పంటల సాగుపై రైతులకు ఆత్మ శిక్షణ కార్యక్రమాన్ని కందుకూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి అనంతపురం వ్యవసాయ సంచాలకులు రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను సాగు చేయాలన్నారు. ప్రత్యామ్నాయ పంట విత్తనాలు కావాల్సిన రైతులు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం వేరుశనగ, ఆముదం పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ శశికళ, ఏఈఓ మురళీకృష్ణ, ఆత్మ ఏటీఎం అనురాధ, వ్యవసాయ సిబ్బంది అపర్ణ, వెంకటస్వామి పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ చేయాలి: ఎస్ఎఫ్ఐ

అనంతపురం ప్రెస్‌క్లబ్/కల్చరల్, ఆగస్టు 27: రామ్‌నగర్‌లోని బీసీ బాలుర కళాశాల వసతిగృహంలో మృతి చెందిన విద్యార్థి తేజ విషయంలో సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరమేష్, సిద్దు డిమాండ్ చేశారు. మంగళవారం గణేనాయక్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి తేజ మృతిపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా అధికారులు స్పందించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, శివ, వంశీ, సభ్యులు వెంకటేష్, అరవింద్, గణేష్, సోము, హిరణ్య, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా దులీప్‌ట్రోఫీ నిర్వహణ: కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 27: బీసీసీఐ ఆధ్వర్యంలో ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించే దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, దులీప్ ట్రోఫీ నిర్వాహణ కమిటీ చైర్మన్ వినోద్‌కుమార్ ఆదేశించారు. దులీప్‌ట్రోఫీ నిర్వహణపై మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించే దులీప్‌ట్రోఫీ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెప్టెంబరు 5వతేదీ నుంచి 22వతేదీ వరకు నిర్వహించనున్న ట్రోఫీలో భారత జట్టు క్రీడాకారులు పాల్గొంటారన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, ఏపీఎస్పీడీసీఎల్ సంపత్‌కుమార్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మేనేజర్ ఆదిత్యవర్మ, మున్సిపల్ కమిషనర్ పీవీఎస్ఎన్ మూర్తి, గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబి దేవి, డీఈఓ వరలక్ష్మి, డీఎస్పీ ప్రతాప్‌కుమార్, మాజీ రంజీ క్రికెటర్ షాబుద్దీన్, కోచ్ యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు.

12 టన్నుల టమోటా కొనుగోలు

అనంతపురంరూరల్, ఆగస్టు 27: జిల్లా మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో 12 టన్నుల టమోటాలను సంబంధిత అధికారులు కొనుగోలు చేశారు. వర్షాలకు రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో టమోటా కొనుగోలుకు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో మంగళవారం కక్కలపల్లి మార్కెట్‌లో రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తదితరులు టమోటా కొనుగోలు చేపట్టారు. కిలో రూ.14తో 12టన్నుల టమోటాను కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన టమోటాను విజయవాడకు పంపినట్లు ఏడీ సత్యనారాయణ చౌదరి తెలిపారు. కార్యక్రమంలో రైతు బజారు ఇన్‌చార్జ్ ప్రతాప్ రుద్ర పాల్గొన్నారు.

అనంతవాసులకు జాతీయస్థాయి అవార్డులు



దేవరకొండ కౌసల్య బృందానికి అవార్డు అందజేస్తున్న అతిథులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 27: అనంతవాసులను జాతీయస్థాయి అవార్డులు వరించాయి. మదర్ సర్వీస్ సొసైటీ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విజయవాడ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు కర్ణాటక, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలువురు స్వచ్ఛంద సేవకులకు, కళాకారులకు అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా కళల విభాగంలో అనంతపురం నగరానికి చెందిన ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య బృందానికి మదర్ సర్వీస్ సొసైటీ నిర్వాహకుడు మల్లాది ప్రసాదరావు, మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి జాతీయస్థాయి అవార్డులు అందజేసి సత్కరించారు.

'ఉద్యోగాల సృష్టికర్తలుగా ఎంబీఏ విద్యార్థులు'

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 27: ఎంబీఏ విద్యార్థులు ఉద్యోగాల సృష్టికర్తలుగా రాణిస్తున్నారని చార్టెడ్ అకౌంటెంట్ ట్రైనర్, మేనేజ్‌మెంట్ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ రఘునాథ్ అన్నారు. మంగళవారం జేఎన్‌టీయూ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఫైనాన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'బిజినెస్ ప్లాన్' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఫైనాన్స్ క్లబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో రఘునాథ్ మాట్లాడుతూ ఇన్నోవేషన్, క్రియేటివిటీ బిజినెస్ ప్లాన్‌పై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీసీ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఉన్న వారికే భవిష్యత్తు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 27: ప్రతిభ ఉన్న వారికే భవిష్యత్తు ఉంటుందని అమర్‌రాజా ఎనర్జీ మొబిలిటి ఏజీఎం ఈశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలురు ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించిన మేళాకు హాజరైన ఆయన మాట్లాడుతూ సాధారణ కోర్సులకంటే ఐటీఐ, పాలిటెక్నిక్ అభ్యసించే విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 27: మానవతా స్వచ్ఛందసేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మంగళవారం ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు శీలా జయరామప్ప, కార్యదర్శి గంగిరెడ్డి ఆధ్వర్యంలో రుద్రంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 75 మంది 9, 10వ తరగతుల విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, అనంతయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమంగళి, ఉపాధ్యాయులు, గురివిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు మహిళ మృతి

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 27: మండలంలోని బసంపల్లి గ్రామంలో పాముకాటుకు గురై మహిళ మృతి చెందింది. గ్రామానికి చెందిన పుష్ప(29) సోమవారం స్థానికంగా ఉన్న పొలంలో కూలిపనికి వెళ్లింది. అక్కడ పనిచేస్తుండగా పాముకాటుకు గురైంది. చికిత్స నిమిత్తం పుట్టపర్తికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మహిళ అదృశ్యం



అలివేలి పద్మావతి

గార్లదిన్నె, ఆగస్టు 27: మండల పరిధిలోని ఇల్లూరు గ్రామానికి చెందిన అలివేలి పద్మావతి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. భర్త లక్ష్మీనారాయణశెట్టి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో అలివేలి పద్మావతి మతిస్థిమితం కోల్పోయింది. 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు మంగళవారం గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ విద్యార్థిని...

అనంతపురం క్రైం: నగరంలోని ఓ డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైంది. కూడేరు మండలం కొర్రకోడుకు చెందిన భావన నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. సమీపంలోని ఓ వసతిగృహంలో ఉంటోంది. ఈనెల 24న హాస్టల్ మారుతున్నానని చెప్పి లగేజీ తీసుకుని బయటకు వెళ్లింది. అప్పటి నుంచి కనిపించలేదు. ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు మంగళవారం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు.

ఘనంగా ప్రభుపాదుల ఆవిర్భావోత్సవం



అభిషేకం చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 27: శ్రీలప్రభుపాదుల ఆవిర్భావోత్సవాన్ని మంగళవారం జిల్లాకేంద్రంలోని ఇస్కాన్ మందిరంలో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం ప్రభుపాదులస్వామి ఉత్సవమూర్తికి రుత్వికుల వేదమంత్రోచ్చారణల నడుమ వివిధరకాల సుగంధ ద్రవ్యాలు, నదీజలాలు, పళ్లరసాలతో అభిషేకించారు. అనంతరం రాధాపార్థసారథులకు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాకార్యక్రమాలు, దశహారతుల సమర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర్ గౌరంగదాస్ పాల్గొన్నారు.



శాంతినగర్ రోడ్డులో వేడుకలు

అనంతపురం కల్చరల్: కృష్ణాష్టమి సందర్భంగా మంగళవారం మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కృష్ణ భగవానుడి మూలవిరాట్‌కు ఫలపంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని పలు ప్రాంతాల్లో భక్తులు కృష్ణాష్టమి సందడిని కొనసాగించారు. శాంతినగర్‌రోడ్డులో చిన్న, పెద్ద అందరూ ఉట్టి కొడుతూ సంబరాలు చేసుకున్నారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో సందడి చేశారు.

అత్యాచారం చేసిన వారిని శిక్షించాలి

అనంతపురంరూరల్, ఆగస్టు 27: ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పీవీకేకే డిప్లొమో ప్రిన్సిపాల్ వైభవ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పీవీకేకే డిప్లొమో కళాశాలలో అత్యాచార ఘటనను నిరసిస్తూ విద్యార్థులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వైభవ్ మాట్లాడుతూ దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'డిమాండ్లను పరిష్కరించండి'

అనంతపురం కల్చరల్, ఆగస్టు 27: తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ మెడికల్, సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్‌రెప్స్‌కు చట్టబద్ధమైన పని విధానాలను నిర్ణయించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మనోహర్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు సావిత్రమ్మ మృతి



సావిత్రమ్మ (ఫైల్)

అనంతపురం కల్చరల్, ఆగస్టు 27: శతాధిక వృద్ధురాలు బండారు సావిత్రమ్మ(101) మృతి చెందారు. కృష్ణాష్టమి పర్వదినాన సోమవారం రాత్రి కోర్టురోడ్డులోని ఆమె నివాసంలో తుదిశ్వాస విడిచారు. మహాత్మగాంధీ నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. సావిత్రమ్మ మృతి పట్ల విశ్రాంత తహసీల్దార్ పాలసముద్రం నాగరాజు, ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు మాధవరెడ్డి, యాదవల్లి సుబ్రహ్మణ్యం, కేదార్‌నాథ్, యాగంటి రామకృష్ణారెడ్డి, కేవీఎస్ చలపతిరెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం సావిత్రమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంచాలి

జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 27: ఇంజనీరింగ్ విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంచేలా కృషిచేయాలని వర్సిటీ అనుబంధ కళాశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు సూచించారు. మంగళవారం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం సెమినార్ హాల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ల 15వ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీ జోజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో భాగంగా ఇంజనీరింగ్ పాఠ్యాంశాలతోపాటు క్రీడలను సిలబస్‌గా చేర్చడం జరిగిందన్నారు. టైంటేబుల్ ప్రకారం విద్యార్థులకు ఆయా కళాశాలల క్రీడా మైదానంలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, మారాల రామశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

'ప్రతి విద్యార్థికీ ఉద్యోగమే లక్ష్యం'

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 27: ప్రతి విద్యార్థికి ఉద్యోగాన్ని కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకరయ్య తెలిపారు. మంగళవారం కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శంకరయ్య మాట్లాడుతూ అంతర్జాతీయ సంస్థలైన హెటిరో, మెడ్‌కోర్, విప్రో లాంటి 15 కంపెనీలు జాబ్‌మేళాను నిర్వహించాయన్నారు. 951మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 681మంది ఉద్యోగ అర్హత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అనురాధ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గార్లదిన్నె, ఆగస్టు 27: సూక్ష్మసేద్యానికి సంబంధించి డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఐఏఓ సుశీలమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని గార్లదిన్నె, పెనకచెర్ల, కనుంపల్లి తదితర గ్రామాల్లో డ్రిప్ కంపెనీ సిబ్బందితో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రైతులకు అవసరమైన డ్రిప్, స్ప్రింక్లర్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 5 ఎకరాలు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీ, 5 ఎకరాలపై ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. పొలానికి సంబంధించిన 1బీ, ఎఫ్ఎంబీ స్కెచ్, చెక్కుబంది సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, బోర్‌వెల్, కరెంట్ బిల్లులతో రైతు సేవాకేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9014505130 నంబరులో సంప్రదించాలని కోరారు.

'హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి'

అనంతపురం విద్య, ఆగస్టు 27: నగరంలోని నెంబర్-4 ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఆలం, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతిభ భారతి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయా సంఘాల నాయకులు సోషల్ వెల్ఫేర్ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము హాస్టల్‌ను సందర్శించి సమస్యలను విద్యార్థులను అడిగామన్నారు. వారు సమస్యలను పేపర్‌పై రాసి ఇచ్చారన్నారు. ఇది జీర్ణించుకోలేని వార్డెన్ నాగార్జునరెడ్డి విద్యార్థి సంఘాల నేతలపై దుర్భాషలాడారన్నారు. ఆయనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భీమేష్, నిరంజన్, రవికుమార్, నవీన్, మౌనిక, వసంత పాల్గొన్నారు.

'ఉద్యోగ భద్రత కల్పించాలి'

అనంతపురం అర్బన్, ఆగస్టు 27: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, నాయకులు మహేష్, రాజు, మహేంద్ర, శశి తదితరులు అనంతపురం ఐఎంఎల్ డిపో ఇన్‌చార్జి మేనేజర్ శివశంకర్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. త్వరలో అమలు చేసే నూతన మద్యం పాలసీలో తమను భాగస్వామ్యులను చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు హరీష్, రమేష్, భరత్, శివ, బాలు, అభి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

అనంతపురంరూరల్, ఆగస్టు 27: విద్యుత్‌శాఖ ఎంఅండ్‌పీ-2 ఈఈగా రవిశంకర్ బాధ్యతలు చేపట్టారు. ఈయన తిరుపతిలో డీఈఈగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. మంగళవారం విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ వద్ద రిపోర్ట్ చేసుకుని బాధ్యతలు తీసుకున్నారు. పలువురు ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బీసీ హాస్టల్ పరిశీలన

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 27: బీసీ హాస్టల్‌లో ఉరి వేసుకొని మృతి చెందిన ఇంటర్ విద్యార్థి తేజ వసతి పొందుతున్న రామ్‌నగర్‌లోని బీసీ బాలుర కళాశాల వసతిగృహాన్ని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ పరిశీలించారు. మంగళవారం హాస్టల్‌కు వెళ్లిన ఆయన పలువురు విద్యార్థులను తేజ మృతిపై ఆరా తీశారు. మృతి చెందడానికి గల కారణాలు, విద్యార్థి తేజ ఏమైనా ఇబ్బందులు పడుతున్నాడా అని విద్యార్థులను అడిగారు. సమస్యలను విద్యార్థులు వార్డెన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారం అందజేస్తున్న సూపరింటెండెంట్

అనంతపురం టౌన్, ఆగస్టు 27: జిల్లా సర్వజన ఆస్పత్రిలో బాలింతలకు పౌష్టికాహారాన్ని ఇన్నర్‌వీల్ సంస్థ సభ్యులు అందజేశారు. మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టర్లు పద్మజ, హేమలత బాలింతలకు బ్రెడ్లు, మిల్లెట్‌తో తయారుచేసిన లడ్డూలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ సభ్యులు శ్రీవల్లి, జయంతి, దీప్తి, పద్మ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఆవు, దూడను రక్షించిన స్థానికులు



ఆవుకు ప్రసవం చేస్తున్న పశువైద్యులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 27: ప్రసవ వేదనతో బాధపడుతున్న ఆవుకు స్థానికులు సపర్యలు చేసి ఆవుతోపాటు దూడను రక్షించారు. మంగళవారం సాయంత్రం స్థానిక మూడవ రోడ్డులో ఓ ఆవు దూడను ప్రసవించేందుకు ఇబ్బంది పడుతుండడం చూసిన మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ లక్ష్మిరెడ్డితోపాటు స్థానిక ప్రజలు 1962కు ఫోన్ చేసి సమాచారమందించారు. పశువైద్యులు అక్కడికి చేరుకుని వైద్యసేవలందించి దూడను సురక్షితంగా బయటకు తీసారు.

వర్సిటీల చట్టాలను కొనసాగించాలి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 27: విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి చట్టాలను యథావిధిగా కొనసాగించాలని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ పాలసీ కార్యదర్శి సుబ్రమణ్యం మంగళవారం ప్రకటనలో కోరారు. జాతీయ విద్యావిధానంతో విద్యార్థులపై ఆర్థిక భారాన్ని మోపారని తెలిపారు.

కసాపురంలో ప్రత్యేక పూజలు



నెట్టికంటి ఆలయంలో ప్రాకారోత్సవం
(ఇన్‌సెట్‌లో) సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులు

గుంతకల్లు, ఆగస్టు27: కసాపురం దేవస్థానంలో శ్రావణ మాస నాలుగవ, చివరి మంగళవారం రోజున ఉత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, పరిచారకులు తెల్లవారుజామునే నెట్టి కంటి ఆంజనేయ స్వామి విరాట్టుకు అభిషేకాలు, అలంకారాలు చేశారు. ఆలయంలో హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణాలు చేశారు. మధ్యాహ్నం మహా మంగళహారతిని నిర్వహించారు. రాత్రి సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను వెండి రథంపై ఉంచి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ధర్మాజీ, ఏఈఓ మల్లికార్జున, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కే సుగుణమ్మ, గుంతకల్లు, కసాపురం, దోసలుడికి, చెన్నప్పకొట్టాల, తదితర గ్రామాల నుంచి భక్తులు ప్రాకారోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమాలలో ఆలయ సూపరింటెండెంటు వీ వెంకటేశులు, ప్రధానార్చకులు గరుడాచార్యులు, అనంతాచార్యులు, రాఘవాచార్యులు, సిబ్బంది నాగేశ్వరరెడ్డి, వేమన్న, అర్చకులు, పరిచారకులు సిబ్బంది పాల్గొన్నారు.

నేమకల్లులో...



వెన్న అలంకరణలో
నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, ఆగస్టు 27: నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం హనుమంతుడి నామస్మరణతో మార్మోగింది. శ్రావణమాసం నాల్గవ మంగళవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్ కుమారా చార్యులు, సంతోష్‌కుమారార్యులు పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మాల్య విసర్జన, విష్ణు సహస్రనామ పారాయణం, సుందరకాండ పారాయణం నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను వెన్నతో అలంకరించారు. ఈ సందర్భంగా కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 27: పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని తహసీల్దారు రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో మంగళవారం పంట నమోదు కార్యక్రమాన్ని తహసీల్దారు రమాదేవి, మండల వ్యవసాయాధికారి కే స్వాతి పరిశీలించారు. ప్రత్యామ్నాయ పం టల కోసం సబ్సిడీతో ఉలవలు, పెసలు, అలసంద, మినుములు, కొర్ర విత్తనాలను అందజేస్తామని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కళ్యాణదుర్గం(శెట్టూరు): మండల పరిధిలోని అయ్యగార్లపల్లి రైతు సేవా కేంద్రాన్ని వ్యవసాయ శాఖ ఏడీ యల్లప్ప మంగళవారం సందర్శించారు. అయ్యగార్లపల్లి గ్రామంలో 2024 ఖరీఫ్‌కు సంబంధించి ఈ క్రాప్ నమోదు గురించి తెలుసుకున్నారు. గ్రామంలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. వేరుశనగ సాగు, పంటను ఆశించు పురుగులు, తెగుళ్ల గురించి, వాటి నివారణ గురించి రైతులతో చర్చించారు.

రేపు ఐటీఐ ప్రవేశానికి కౌన్సెలింగ్

గుంతకల్లు టౌన్, ఆగస్టు 27: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో విడత ప్రవేశానికి గురువారం కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ విద్యాసాగర్ మంగళవా రం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలింగ్‌కు దరఖాస్తు చేసుకుని, వెరిఫి కేషన్ చేయించుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు , ఫొటోలు తీసుకు ని గురువారం ఉదయం 10 గంటలకు గుంతకల్లులోని ప్రభుత్వ ఐటీఐలో హాజరుకావాలన్నారు.

రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 27: పొదుపు మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించాలని ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి సూచించా రు. పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో మంగళవారం సాధన మహిళా సమాఖ్య , పట్టణ మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి పొందిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్‌ప ర్సన్ ఎన్ భవాని, కౌన్సిలర్ గుడిపాటి ఆంజనేయులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి పది ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లు అందజేస్తున్న
పాఠశాల విద్యా కమిటీ చైర్మన్

విడపనకల్లు, ఆగస్టు 27: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి ఆ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఏ ఈశ్వరమ్మ 10 ఫ్యాన్లను మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ తులసి ప్రియాకు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినుల సౌకర్యార్థం పది ఫ్యాన్లు అందివ్వటం హర్షణీయం అన్నారు. గ్రామ పెద్దలు రాజుస్వామి, వన్నూరు స్వామి, ఉపాధ్యాయినులు తదిరులు పాల్గొన్నారు.

బోయరెడ్డిపల్లి ఘటనలో 9మంది అరెస్ట్

యాడికి, ఆగస్టు 27: మండలంలోని బోయరెడ్డిపల్లిలో ఈనెల 15న జరిగిన ఇరువర్గాల ఘర్షణకు సంబంధించి మంగళవారం తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. బోయరెడ్డిపల్లిలో రస్తా విషయంపై ఈనెల 15న ఇరువర్గాలకు చెందినవారు రాళ్ల, కట్టెలతో దాడులు చేసుకున్నారు. ఇరువర్గాలకు చెందిన వారు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదుచేసినట్లు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఒక వర్గానికి చెందిన తొమ్మిది మందిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో కుక్కల నాగేశ్వర, కుక్కల శ్రీనివాసులు, కుక్కల వెంకటరమణ, కుక్కల నాగేంద్ర ప్రసాద్, పడమల శివ, పడమల వేణుగోపాల్, పడమల లక్ష్మినారాయణ, పడమల గంగరాజు, చింతకాయల లోకేశ్వర ఉన్నారు. మరొక వర్గానికి చెందిన 14మందిని ఈనెల 17న అరెస్ట్ చేసిన సంగతి విదితమే.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలు

పెద్దపప్పూరు, ఆగస్టు 27: మండలంలోని ముచ్చుకోట గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని బుక్కరాయసముద్రం మండలం దంతలూరుకు చెందిన ఆది, శివ, నాగరాజుకు గాయాలయ్యాయి. వారు ముగ్గురిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసునమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 27: గుంతకల్లు-ఆదోని రైలుమార్గంలో నేమకల్లు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి 35 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు జీఆర్పీ ఎస్ఐ రామదాసు మంగళవారం తెలిపారు. మృతదేహం వద్ద ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



యాడికిలో అలంకరణలో రాధాకృష్ణులు



దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు



కొత్తపేటలోని శ్రీకృష్ణుడు



గుత్తిలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



వీ కొత్తకోటలో కృష్ణుడి విగ్రహ ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

యాడికి, ఆగస్టు27: మండలంలోని కొట్టాలపల్లి వెలసిన రాధాకృష్ణ ఆలయంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణుల మూలవిరాట్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశా రు. గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త శ్రీనివాసయాదవ్, కమిటీ సభ్యులు గంగరాజు, రఘురాములు, రంగారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రాజా, రామాంజనేయులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, నాయకులు రామచంద్రారెడ్డి, ఆదినారాయణ, తాండ్ర విక్రమ్, నరసింహచౌదరి తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు.

గుత్తి/గుత్తిరూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులోని శ్రీకృష్ణ మందిరం వద్ద మంగళవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక రథంలో శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చి స్థానిక మస్రోసత్రం వద్ద నుంచి ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ గుత్తి ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. కొత్తపేట శ్రీకృష్ణమందిరం వరకు ర్యాలీ సాగింది. ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు, న్యాయవాది సోమశేఖర్, టీడీపీ నాయకులు సంపత్‌కుమార్, ఎంకేచౌదరి, చికెన్ శ్రీనివాసులు, చెట్నేపల్లిరమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కొనకొండ్ల రోడ్డులోని వివేకానంద పాఠశాలలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలహెచ్‌ఎం నాగమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గురుదాస్, సీఈఓ శ్రీనివాసులు, ప్రీప్రైమరీ ఇన్చార్జి సరోజమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విడపనకల్లు : మండలంలోని వీ కొత్తకోట, గడేకల్లు గ్రామాల్లో కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుడి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. వీ కొత్తకోటలో మహిళలు హారతులతో, చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ లో పాల్గొన్నారు. గ్రామ నడిబొడ్డున ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలోని సంతాన వేణుగోపాలస్వామి దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలను యాదవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి బంగారు కవచధారణ చేశారు. ఉత్సవవిగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. వినాయకసర్కిల్ వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంచేపట్టారు. యాదవసం ఘం నాయ కులు బంగి ఉమాశంకర్, నాయకులు రామస్వామి, బంగి రమేష్, టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు తిమ్మారెడ్డి, రామకృష్ణ, బాల య్య, సర్పంచ్ వన్నూరుస్వామి, మల్లేశప్ప తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను యాదవ కులస్థులు మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాధాకృష్ణుల చిత్రపటాలను, విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు.



రాయదుర్గంలోని వేణుగోపాలస్వామి



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో గుంతకల్లు వివేకానంద పాఠశాల విద్యార్థులు



చదంగొల్లలదొడ్డిలో కృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు

ఆలయానికి వెండి గ్లాసుల సమర్పణ



ఆలయానికి వెండిగ్లాసులు
అందజేస్తున్న దాతలు

కణేకల్లు, ఆగస్టు 27: మండల కేంద్రంలోని చిక్కణ్ణేశ్వర ఆలయానికి గ్రామానికి చెందిన బూశెట్టి వీరభద్రశెట్టి కుటుంబసభ్యులు 11 వెండి గ్లాసులను వితరణ చేశారు. వారు మంగళవారం ఆలయ ధర్మకర్త ప్రసాద్‌రెడ్డి, మృత్యుంజయ, నాగరాజు, ముక్కన్న తదితరుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులకు అందజేశారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి జైనబ్బీ దర్గా ఉరుసు ఉత్సవాలు

ఉరవకొండ, ఆగస్టు 27: పట్టణంలోని బీబీ జైనబ్బీ దర్గా ఉరుసు ఉత్సవా లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో కమిటీ సభ్యులు దర్గా ను ముస్తాబు చేస్తున్నారు. ఈ 30వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయి. బుధవారం రాత్రి అల్లపరెడ్డి ఇంటి నుంచి గంధం ఊరేగింపుగా తెల్లవారుజాము న దర్గాకు చేరుస్తారు. గురువారం పామిడి బాషాసాబ్ దుకాణం నుంచి షంషేర్‌ను శుభ్రం చేసి రాయదుర్గం బుడేన్ సాబ్ ఇంటికి చేరుస్తారు. అర్ధరాత్రి షంషేర్‌ను ఊరేగిస్తారు. 30వ తేదీ జియరత్ ఫతేహాను నిర్వహిస్తారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలి

గుత్తి, ఆగస్టు 27: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారం భించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. వారు మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్ష, కార్య దర్శులు వినోద్, వెంకట్‌నాయక్ మాట్లాడుతూ... ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అనుగుణంగా మౌలికవసతులను కల్పించాలని, సైన్స్‌ల్యాబ్‌లో పరికరాలు ఇవ్వాలని, సబ్జెక్టుకు అనుగుణంగా అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోహిత్, రాజేష్, మధు, లోకేష్, శ్రీకాంత్, షేక్షావలి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేయాలని వినతి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 27: పట్టణంలోని బాబుజగ్జీవన్‌రామ్ కాలనీలో ఉన్న జీబీసీ కాలువ నుంచి భీమిరెడ్డి కాలనీ వరకు సీసీ రోడ్డు వేయాలంటూ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లావణ్యకు మంగళవారం దళిత జన సేవా సంఘం వ్యవస్థాపకుడు చిన్న, ఆ కాలనీ వాసులు వినతి పత్రాన్ని అందజేశారు. భీమిరెడ్డి కాలనీ నుంచి గుత్తి రోడ్డుకు రావాలంటే కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే సీసీరోడ్డు వేసి, రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను తొలగించాలని కోరారు.

హంద్రీనీవా నీరివ్వాలని వినతి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 27: కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం మద్దికెర గ్రామంలోని హంద్రీనీవా కాలువ బ్రిడ్జి వద్ద నుంచి గుంతకల్లు మండలంలోని పలు గ్రామాలకు తాగు, సాగు నీరు ఇవ్వాలని సీపీఐ నాయకులు కోరారు. హంద్రీనీవా కాలువను ఏఈ హరిప్రసాద్ మంగళవారం పరిశీలించారు. సీపీఐ నాయకులు ఏఈని కలిశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతానని ఏఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మండల కార్యదర్శి రామాంజి నేయుల యాదవ్, కొత్తపల్లి జడ్పీటీసీ సభ్యుడు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

భూబాధితుల రాష్ట్ర సదస్సుకు తరలిరండి

తాడిపత్రి, ఆగస్టు27: విజయవాడలో ఈనెల 28న సీపీఐ ఆధ్వ ర్యంలో నిర్వహించే భూ బాధితుల రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య పేర్కొన్నారు. పట్టణంలోని రంగప్ప కాలనీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ కుంభకోణాలు, పేదల భూముల ఆక్రమణలపై సదస్సులో చర్చిస్తామ న్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నారాయణరెడ్డి, బాలనాయుడు, ఓబులేసు, వీటీ రామాంజి, నాగరంగయ్య పాల్గొన్నారు.

పీఏబీఆర్‌లో పెరుగుతున్న నీటి మట్టం



లింక్ చానల్ ద్వారా డ్యాంలోకి వస్తున్న నీరు

కూడేరు, ఆగస్టు 27: పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం రోజు రోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం డ్యాంలో నీటి మట్టం 1.536 టీఎంసీలకు చేరింది. తుంగభద్ర డ్యాం నుంచి పీఏబీఆర్ డ్యాంకు లింక్ చానల్ ద్వారా 460 క్యూసెక్కుల నీరు గత నెల 28 నుంచి వస్తోంది. దీంతో నీటి మట్టం పెరుగుతోంది.

జీడిపల్లి రిజర్వాయర్‌కు 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 27: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం వెల్లడించారు. రిజర్వాయరులో 1.402 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

పెద్దపప్పూరు, ఆగస్టు27: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శింగనగుట్టపల్లి, తబ్జుల, చాగల్లు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, వీధిలైట్లు, రోడ్ల తదితర సౌకర్యాలపై ఆరాతీశారు. రైతుల పంట సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాలు అభివృద్ధిపథంలో నడిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. సభల్లో తహసీల్దార్ బాలాజీ నాయక్, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, బీసీ రామకృష్ణారెడ్డి, మైనార్టీ నాయకుడు షెక్షావలి, అమర్‌నాథ్‌రెడ్డి, మండల క్లస్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణస్వామి యాదవ్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

'పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపండి'



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న నాదల్‌ఆలీ

డీ.హీరేహాళ్, ఆగస్టు 27: రాయదుర్గం నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో అభివృద్ధికి నోచుకోని పరిస్థితిలో ఉందని రాయదుర్గం స్టీల్‌ప్లాంట్ సాధన కమిటీ అధ్యక్షుడు బీఎం నాదల్‌ఆలీ కేంద్ర కేబినెట్ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని టీడీపీ కేంద్రకార్యాలయంలో మంగళవారం కేంద్రమంత్రితో పాటు , టీడీపీ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తదితరులు మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల కోసం డి హీరేహాళ్ మండలం ఓబుళాపురం గనులు, ఉంతకల్లు రిజ ర్వాయర్ నీటి ద్వారా రాయదుర్గంస్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలియజేశారు.

వైభవంగా తోటప్పజ్జ స్వామి రథోత్సవం

బొమ్మనహాళ్, ఆగస్టు 27: మండలంలోని బొల్లనగుడ్డంలో వెలసిన తోటపజ్జస్వామి 47వ పూజోత్సవంలో భాగంగా మంగళవారం వైభవంగా రథోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి గంగపూజ, గణపతిపూజ, నవగ్రహ పూజా, పంచామృతాభిషేకం, రుద్రహోమం నిర్వహించి సాయంత్రం భారీ జనసందోహం మధ్య రథోత్సవాన్ని లాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై స్వామివారికి పూజలు జరిపించి రథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్లు బలరాంరెడ్డి, హనుమంతరెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, అప్పారావు, మాజీ డైరెక్టర్లు మహేంద్ర, నాగరాజు, టీడీపీ నాయకులు సల్లాపురం బాబు, గ్యాస్ గోవింద, మాజీ ఎంపీటీసీ గోపాల్, వన్నూరుస్వామి, మల్లికార్జున, సైకిల్‌షాప్ హనుమంత తదితరులు పాల్గొన్నారు.



భారీ జనసందోహం మధ్య
రథోత్సవం, పాల్గొన్న ఎమ్మెల్యే
కాలవ శ్రీనివాసులు

అర్హులైన రైతులందరికీ బిందు సేద్య పరికరాలు: ఏపీడీ

కణేకల్లు /బెళుగుప్ప, ఆగస్టు 27: వ్యవసాయ తోటలు సాగు చేస్తున్న అర్హులైన రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో బిందు, సేద్య పరికరాల పంపిణీకి చర్యలు తీసుకుంటోందని ఏపీ ఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన మంగళవారం మండలంలోని పూలచెర్ల గ్రామంలో బిందు,సేద్యం పరికరాల కోసం రిజిస్ట్రే షన్ ప్రక్రియను ప్రారంభించారు. అలాగే బెళుగుప్ప మండలంలోని నక్కలపల్లిలో మంగళవారం డ్రిప్, స్ప్రింక్లర్ల వినియోగం, రాయితీలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని రైతులకు తగు సూచనలిచ్చారు. అర్హులైన వారు స్థానిక ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ చేయుకుంటే పరిశీలించి మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. వివరాల కోసం 7995010059 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యాడికి, ఆగస్టు27: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను మంగళవారం సీజ్ చేసినట్లు యాడికి సీఐ ఈరన్న తెలిపారు. యా డికికి చెందిన రంగనాయకులు అనే వ్యక్తి పెద్దపప్పూరు మండలం జూటూరు సమీపాన పెన్నానది నుంచి తన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వేములపాడు క్రాస్ వద్ద సీజ్‌చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదుచేశామని తెలిపారు.

త్వరలోనే ముసుగు తొలగిస్తాం: టీడీపీ నాయకులు

డి హీరేహాళ్, ఆగస్టు 27: టీడీపీకి వస్తున్న ఆదరణ ఓర్వలేక కొందరు ఫేక్ చిరునామాతో సోషల్ మీడియాలో పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అతి త్వరలోనే ఆ ముసుగు తొలగిస్తామని టీడీపీ మండల కన్వీనర్ హనుమంత రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగల్లి రాజు పేర్కొన్నారు. వారు మంగళవారం విలే కరుల సమావేశంలో మాట్లాడుతూ.... నాలుగురోజుల క్రితం లింగమనేని సుబ్బ య్యచౌదరి అనే పేరు మీద సోషల్ మీడియాలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుపై అసత్య ఆరోపణలు చేస్తూ పోస్టులు పెట్టారన్నారు. వాటిని ఖండిస్తూ ఆ లింగమనేని సుబ్బయ్యచౌదరి అనే అతడిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. త్వరలోనే ముసుగుదొంగను బయటకు లాగి ప్రజాక్షేత్రంలో నిలబెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మొండి మల్లికార్జున, నాయకులు శ్రీరాములు, వెంకటేష్, తిప్పేస్వామి, వన్నూరు స్వామి, నాగయ్య, సురేష్, మరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక

తాడిపత్రి, ఆగస్టు 27: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించినట్లు ఎంపీడీఓ రంగారావు తెలిపారు. ఏపీడీ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఆర్పీ లక్ష్మీనారాయణ, ఏసీఓ రాజ్యలక్ష్మి హాజరయ్యారు. ఏపీఓ మాట్లాడుతూ మండలంలో 26పంచాయతీలకు గాను ఉపాధిహామీ పథకం కింద 1487పనులుచేపట్టామన్నారు. వీటికోసం రూ.7,48,49, 566 ఖర్చు చేశామని తెలిపారు. కొన్ని గ్రామాల్లో అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటిలో రూ.89,906 రికవరీ చేసినట్లు తెలిపారు. గంగాదేవిపల్లి, బోడాయిపల్లిల్లో దాదాపు రూ.11లక్షలు అవకతవకలు ఉన్నాయని, సోషల్ ఆడిట్ సరిగా చేయాలని అధికారులను ఆదేశించారు.

వాగును పూడ్చారని ఫిర్యాదు

తాడిపత్రి, ఆగస్టు27: మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న వాగును కొందరు వ్యక్తులు పూడ్చివేశారని సీపీఐ మండల కార్యదర్శి నాగరంగయ్య నాయకులతో కలిసి మంగళవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు వీటీ రామాంజనేయులు, నారాయణరెడ్డి, బాలనాయుడు, గోపాల్, మదన్ తదితరులు ఉన్నారు.

'వడ్డీ వ్యాపారుల అరాచకాలను అరికట్టాలి'

తాడిపత్రి, ఆగస్టు27: వడ్డీవ్యాపారుల అరాచకాలను అరికట్టాలని మంగళవారం పలు ప్రజాసంఘాలు ఓ ప్రకటనలో డిమాండ్‌చేశాయి. ఇటీవల అప్పు చెల్లించలేదని జయనగర్‌కాలనీకి చెందిన రాజేంద్రను హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు ఆదినారాయణ, శ్రీరామమూర్తి, మల్లప్ప, విజయ్ అన్నారు. ఇష్టానుసారంగా రాజేంద్రను కొట్టి కులం పేరుతో దూషించిన తిప్పారెడ్డి, రామకృష్ణారెడ్డి, వారి కుటుంబసభ్యులపై కేసులు నమోదుచేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు.

కొనకొండ్లలో ట్యాంకర్లతో నీటి సరఫరా



ట్యాంకరు వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

ఉరవకొండ, ఆగస్టు 27: వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల గ్రామంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సత్యసాయి తాగు నీటి పథకం కార్మికులు సమ్మె చేపట్టడంతో తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. తాగు నీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను టీడీపీ స్థానిక నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. ఐదు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నట్లు నాయకులు తెలిపారు.